ప్రతి అక్షరం - ప్రజల కోసం

# రోమింగ్ న్యూస్

తెలుగు దినపత్రిక

యాదాద్రి భువనగిరి

పేజీలు : 8
సంపుటి : 4
సంచిక : 76

శుక్రవారం 26 సెప్టెంబర్ 2025 | చీఫ్ ఎడిటర్ : గొట్టిపర్తి భాస్కర్ | HYDERABAD, KARIMNAGAR, KHAMMAM, NALGONDA, NIZAMABAD, WARANGAL, MAHABUBNAGAR.RANGAREDDY, MEDAK, ADILABAD

## వెస్టిండీస్‌తో టెస్టు సిరీస్ కోసం జట్టు ప్రకటన

రిషబ్ పంత్, శ్రేయస్ అయ్యర్‌లకు దక్కని చోటు



07



# ప్రముఖ రచయిత కొంపెల్లి వెంకట్ గౌడ్ కన్నుమూత

## తెలంగాణలో మెరిసిన ఆణిముత్యం

ప్రముఖ రచయిత కొంపెల్లి వెంకట్ గౌడ్ గుండెపోటుతో రావడంతో ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆయన మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు భావజాలాన్ని రూపొందించడంలో మరియు దాని సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకోవడంలో ఆయన కీలక పాత్ర పోషించారు, ప్రాముఖ్యత కలిగిన సామాజిక-చారిత్రక సంఘటనలను తన రచనలతో వివరించారు.



రచయిత, కవి,
చరిత్ర కారుడు, ఉద్యమకారుడు
మిత్రుడు కొంపల్లి వెంకట్ గౌడ్‌కు
శ్రద్ధాంజలి

హైదరాబాద్, రోమింగ్ న్యూస్: తెలంగాణ తత్వం, తెలంగాణ వాదం, తెలంగాణ ఆత్మగౌరవం కోసం నిరంతరం తపించిన ఆయన తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పని చేశాడు. 'వొడువని ముచ్చట','నీళ్ల ముచ్చట' పుస్తకాలు 'సర్వాయి పాపన్న చరిత్ర' ను రాశారు. సర్దార్ సర్వాయి పాపన్న చరిత్రను వెలుగులోకి తీసుకువచ్చి, చారిత్రక వాస్తవాలను రికార్డు చేసిన ఘనత వెంకట్ గౌడ్‌కే దక్కిందని, తన రచనల ద్వారా తెలంగాణ భావజాలం మరియు రాజకీయ తత్వాన్ని వ్యాప్తి చేశారని బిఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. కొంపల్లి వెంకట్ ఇక లేరన్న వార్త దిగ్భ్రాంతికి గురిచేసిందని, ఆయన సాహిత్య రంగంలో, సర్దార్ సర్వాయి పాపన్న చరిత్రను అక్షర బద్ధం చేసి ప్రజలకు అందించారని, తెలంగాణ తత్వం, ఉద్యమ భావజాలాన్ని తన కలంలో నింపుకున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ పేర్కొన్నారు. కొంపల్లి వెంకట్ హఠాన్మరణం తెలంగాణ సాహిత్య రంగానికి తీరని లోటు అని, ఇద్దరు మహానుభావుల ఆలోచనలను పుస్తకరూపంలో పదిలపరిచారని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ పేర్కొన్నారు. వెంకట్ గౌడ్ మృతికి మాజీ మంత్రులు హరీష్ రావు, సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, కవులు, రచయితలు, మిత్రులు సంతాపం వ్యక్తం చేశారు, ఆయన కుటుంబానికి సానుభూతి తెలిపారు.



# సర్కారు చేతికి మెట్రో

## ఎల్అండ్‌టీ నుంచి ప్రభుత్వం స్వాధీనం

- మెట్రోపై ఉన్న రూ. 13 వేల కోట్ల అప్పు సైతం.
- ఎల్అండ్‌టీకి రూ.2,100 కోట్లు ఇచ్చేందుకూ గ్రీన్ సిగ్నల్
- సీఎం రేవంత్, సంస్థ సీఎండీ సుబ్రమణ్యన్ భేటీ.. కుదిరిన ఒప్పందం

**రోమింగ్ న్యూస్, హైదరాబాద్ :** హైదరాబాద్ మెట్రోను ఎల్అండ్ నుంచి టేకోవర్ చేసుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కమాండ్ కంట్రోల్ సెంటర్లో సీఎం రేవంత్ రెడ్డితో ఎల్ అండ్ టీ సీఎండీ సుబ్రమణ్యాన్, సంస్థ ప్రతినిధులు చర్చలు జరిపారు. మొదటి దశ మెట్రో రైలులో తమకున్న మొత్తం వాటాను రాష్ట్ర ప్రభుత్వానికి విక్రయించను డానికి సిద్ధంగా ఉన్నట్టు ఎల్అండ్ కంపెనీ ప్రతి నిధులు స్పష్టం

మిగతా 2 లో



## స్థానికంలో 69 శాతం రిజర్వేషన్లు

బీసీలకు 42% ఎస్సీ, ఎస్టీలకు 27%

స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇవ్వబోతున్నాం

వచ్చే ఏడాదినుంచి తెలంగాణలోనూ సీఎం బ్రేక్ ఫాస్ట్'

చెన్నైలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

04

# నేటి నుంచే మద్యం టెండర్లు




- లిక్కర్ షాపులకు దరఖాస్తులు
- ఒక్కో అప్లికేషన్‌కు రూ.3లక్షల రుసుం
- అక్టోబర్18 వరకు అవకాశం
- మార్గదర్శకాలు జారీ చేసిన ఎక్సైజ్ శాఖ

తెలంగాణలో కొత్త మద్యం దుకాణాలకు నోటిఫికేషన్ విడుదలైంది. నేటి(శుక్రవారం) నుంచి అక్టోబర్ 18 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. అక్టోబర్ 23న డ్రా పద్ధతిలో మద్యం షాపులు కేటాయించను న్నారు. కొత్త షాపులకు 2025 డిసెంబర్ 1 నుంచి 2027 నవంబర్ 30 వరకు లైసెన్స్ కాల పరిమితిగా నిర్ణయించారు. అలాగే టెండర్ ఫీజును రూ.3 లక్షలుగా నిర్ణయించారు. గతంలో టెండర్ ఫీజు 2 లక్షలు ఉండగా.. ఇప్పుడు ఒక లక్ష అదనంగా పెంచుతూ మూడు లక్షలుగా తేల్చారు. అలాగే ఫీజు మొత్తాన్ని ఒకేసారి కాకుండా ఆరు విడతలుగా చెల్లించే వెసులుబాటు కల్పించారు.

## గ్రూప్-1 విజేతలకు రేపు ఆర్డర్లు

- 563 మందికి నియామకపత్రాలు
- అందించనున్న సీఎం రేవంత్ రెడ్డి
- సీఎస్ రామకృష్ణారావు వెల్లడి

02



# దేశాభివృద్ధిలో జాతీయ రహదారుల పాత్ర కీలకం



03

- కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో రహదారులపై చర్చ
- మీడియా సమావేశంలో వెల్లడించిన కిషన్ రెడ్డి
- కాంగ్రెస్, బిఆర్ఎస్‌లకు బిజెపి ఫోబియా పట్టుకుందని విమర్శలు

## దేవాదాయ భూములను రక్షించండి

హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కోరిన మంత్రి కొండా సురేఖ



దేవాదాయ శాఖ భూముల పరిరక్షణ విషయంలో హైడ్రా సాయం చేయాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ కోరారు. దేవాదాయ శాఖ భూములు ఆక్రమణలకు గురవుతున్నాయని, వాటిని పరిక్షించేందుకు ఇప్పటికే డీజీపీఎస్ సర్వే చేపడుతున్నట్టు చెప్పారు.

.. వివరాలు 2లో



## ముగ్గురు బాలికలపై లైంగికదాడి

- ప్రేమ పేరుతో పరిచయం లేని యువకుల నయవంచన
- అల్వాల్ నుంచి యాదగిరి గుట్టకు తీసుకెళ్లి దారుణం
- చివరకు పోక్సో కింద జైలుకు


2

హైదరాబాద్‌లో మరో దారుణం వెలుగులోకి వచ్చింది. ప్రేమ పేరుతో ముగ్గురు బాలికలకు మాయమాటలు చెప్పి యాదగిరిగుట్టకు తీసుకెళ్లి అత్యాచారం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

## స్మితాసబర్వాల్‌కు ఊరట

ఘోష్ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవద్దని హైకోర్టు ఆదేశం

02



ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
శుక్రవారం 26 సెప్టెంబర్ 2025









# అంగన్‌వాడీలకు దసరా సెలవులు

## తొలిసారి 8 రోజుల పాటు మంజూరు

**హైదరాబాద్, సెప్టెంబర్ 25:** రాష్ట్రంలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం ఈ నెల 27 నుంచి అక్టోబర్ 4 వరకు ఎనిమిది రోజుల పాటు దసరా సెలవులు మంజూరు చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. అంగన్వాడీల చరిత్రలో తొలిసారిగా దసరా సెలవులు ఇవ్వడం ఇదే ప్రథమం. ప్రభుత్వ పాఠశాలల మాదిరిగానే దసరా, బతుకమ్మ పండగలు జరుపుకునే విధంగా దసరా సెలవులు మంజూరు చేయాలని ఐఎన్టీయూసీ అనుబంధ తెలంగాణ స్టేట్ ఇందిరా ప్రియదర్శిని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్ బి.అన్నపూర్ణ, ఇతర ప్రతినిధుల బృందం మంత్రి సీతక్కను ప్రత్యేకంగా కలిసి ఇటీవల విజ్ఞప్తి చేశారు. వీరి విజ్ఞప్తిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన మంత్రి సీతక్క సెలవులు మంజూరు చేయించారు. ఈ మేరకు 27 నుంచి అక్టోబర్ 4 వరకు దసరా సెలవులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు విడుదలయ్యాయి. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ టేక్ హోమ్ రేషన్ విధానంలో లబ్ధిదారులకు యథావిధిగా పోషకాహారాన్ని అందజేయాలని సూచించారు. అంగన్‌వాడీలకు సెలవులు మంజూరు చేసినందుకు ప్రభుత్వానికి, మంత్రి సీతక్కకు అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు కృతజ్ఞతలు తెలిపారు. 8 రోజుల పాటు అంగన్‌వాడీ కేంద్రాలు మూసి ఉండనున్నాయి.

# స్మితాసబర్వాల్‌కు హైకోర్టులో ఊరట

## ఘోష్ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవద్దని ఆదేశం

**హైదరాబాద్, సెప్టెంబర్ 25:** ప్రస్తుతం రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారిన ఘోష్ కమిషన్ నివేదికపై పలువురు ఇప్పటికే కోర్టు మెట్లు ఎక్కారు. ఈనేపథ్యంలో సీనియర్ ఐఏఎస్ అధికారిణి స్మితాసబర్వాల్ హైకోర్టును ఆశ్రయించగా ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా ఆమెపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని న్యాయస్థానం ఆదేశాలు జారీచేసింది. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఘోష్ కమిషన్ విచారణ జరిపి ప్రభుత్వానికి సమర్పించిన నివేదిక అమలును నిలిపివేయాలంటూ స్మితా సభర్వాల్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్‌పై వాదనలు విన్న ధర్మాసనం.. నివేదిక ఆధారంగా ఆమెపై చర్యలు తీసుకోవద్దని ప్రభుత్వానికి స్పష్టం చేసింది. ఘోష్ కమిషన్ ఆధారంగా చర్యలు తీసుకోవద్దు.. స్మితా సభర్వాల్‌కు హైకోర్టులో ఊరట సీనియర్ ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్‌కు హైకోర్టులో ఊరట లభించింది. ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా ఆమెపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని న్యాయస్థానం ఆదేశాలు జారీచేసింది. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఘోష్ కమిషన్ విచారణ జరిపి ప్రభుత్వానికి సమర్పించిన నివేదిక అమలును నిలిపివేయాలంటూ స్మితా సభర్వాల్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్‌పై వాదనలు విన్న ధర్మాసనం.. నివేదిక ఆధారంగా ఆమెపై చర్యలు తీసుకోవద్దని ప్రభుత్వానికి స్పష్టం చేసింది. స్మితా సభర్వాల్ గత ప్రభుత్వ హయాంలో సీఎంవోలో అదనపు కార్యదర్శిగా పనిచేశారు. ఘోష్ కమిషన్ రిపోర్టు ఆధారంగా తనపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా రాష్ట్ర ప్రభుత్వానికి మధ్యంతర ఆదేశాలివ్వాలని కోరారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ తనను సాక్షిగా పిలిచిందని, అయితే తనపై ఆరోపణలు చేసే ముందు చట్టప్రకారం ఎలాంటి నోటీసులు ఇవ్వలేదని తెలిపారు. విచారణ కమిషన్ చట్టం-1952లోని 8బీ, 8సీ సెక్షన్ల ప్రకారం నోటీసు ఇచ్చి వివరణ తీసుకోవాలన్న నిబంధనలను కమిషన్ అమలు చేయలేదని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, రాష్ట్ర ప్రభుత్వ అధికారిగా ఆ నిర్మాణ పురోగతిని సమీక్షించానని తెలిపారు. సీఎంవో ప్రత్యేక కార్యదర్శి హోదాలో మూడు బ్యారేజీల నిర్మాణ స్థలాలను కూడా సందర్శించినట్టుగా కమిషన్ నివేదికలో ఉన్నదని పేర్కొన్నారు. మేడిగడ్డ, అ న్నారం, సుందిల్ల బ్యారేజీల నిర్మాణానికి పరిపాలనా అనుమతి, ఆమోదాల మంజూరులో తన ప్రమేయం లేదని తెలిపారు. తనకు వ్యతిరేకంగా వాంగ్మూలం ఇచ్చిన సాక్షులను విచారించే అవకాశం కూడా కల్పించకపోవడం చట్ట వ్యతిరేకమని ప్రకటించాలని కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో తన పాత్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలకు లోబడి ఉన్నదని తెలిపారు. క్యాబినెట్ ఎదుట ఫైళ్లు ఉంచలేదు కాబట్టి చర్యలు తీసుకోవాలని కమిషన్ పేరొనడం చెల్లదని తెలిపారు. కమిషన్ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటే తన ప్రతిష్ఠకు భంగం వాటిల్లుతుందని తెలిపారు. నివేదిక రద్దు చేయాలనని, తుది ఉత్తర్వులు వెలువరించే వరకు నివేదిక అమలును నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు.

# సృష్టి ఫెర్టిలిటీ కేసులో ఈడీ ఎంటర్

**హైదరాబాద్, సెప్టెంబర్ 25:** సరోగసి పేరుతో పిల్లల ట్రాఫికింగ్‌కు పాల్పడిన సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ అక్రమాల వ్యవహారంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారిన ఈ కేసులోకి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ప్రవేశించింది. హైదరాబాద్ పోలీసులు నమోదుచేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ కేసు ఫైల్ చేసింది. సంతానం లేని దంపతుల నుంచి సరోగసి పేరుతో డాక్టర్ నమత్ర భారీగా నగదు వసూలు చేసినట్లు విచారణలో వెల్లడైంది. ఈ నేపథ్యంలో ఆమెను ఈడీ అధికారులు ప్రశ్నించనున్నారు. అబార్షన్ కోసం ఆసుపత్రికి వచ్చే గర్భిణీలకు నగదు ఆశ చూపి ప్రసవం తర్వాత వారి పిల్లల్ని డాక్టర్ నమ్రత కొనుగోలు చేసేవారు. అనంతరం సరోగసి ద్వారా పుట్టిన బిడ్డగా పిల్లలు లేని దంపతులను నమ్మించి పెద్ద ఎత్తున నగదు వసూలు చేశారు. నాలుగేండ్లలో దాదాపు రూ.500 కోట్ల వరకు లావాదేవీలు జరిపినట్లు అధికారులు గుర్తించారు. సికింద్రాబాద్‌తోపాటు విశాఖపట్నంలో ఫెర్టిలిటీ సెంటర్లు ఏర్పాటు చేసిన డాక్టర్ నమత్ర.. ఏజెంట్ల సాయంతో గర్భస్రావం చేయించుకోవాలని దవాఖానకు వచ్చే పేద మహిళలను లక్ష్యంగా చేసుకుని ఈ దందా కొనసాగించారు. ఈ నేపథ్యంలో డాక్టర్ నమ్రతను ఈడీ అధికారులు ప్రశ్నించనున్నారు.

# భూభారతి ఫీల్డ్ టెక్నికల్ స్టాఫ్‌కు ప్రభుత్వం గుర్తింపు

## 708 మంది ఎఫ్‌టీఎస్‌లను కాంట్రాక్టు ఉద్యోగులుగా మార్పు

**హైదరాబాద్, సెప్టెంబర్ 25:** దసరా నవరాత్రుల వేళ రేవంత్ రెడ్డి సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. పలువురు ఉద్యోగులకు దసరా కానుక ప్రకటించింది. అందులో భాగంగా రాష్ట్రంలో భూభారతి ఫీల్డ్ టెక్నికల్ స్టాఫ్‌కు కాంట్రాక్ట్ ఉద్యోగులుగా ప్రభుత్వం గుర్తించింది. దీంతో 708 మంది ఎఫ్‌టీఎస్‌లను టీజీటీఎస్ కాంట్రాక్టు ఉద్యోగులుగా మారుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అలాగే ఆ యా ఉద్యోగుల జీతాలు పెంచుతూ గురువారం ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో కాంట్రాక్ట్ ఉద్యోగులు అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు కొనగాల మహేష్ స్పందిస్తూ.. సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

# ముంచుకొస్తున్న వాయుగుండం

## 29 వరకు నాలుగు రోజుల పాటు వానలు

## బంగాళఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం

## హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరిక

## గురువారం రాష్ట్రవ్యాప్తంగా పలు చోట్ల వర్షం

## ములుగు జిల్లాలో ఎడతెరిపిలేని వాన



**హైదరాబాద్, సెప్టెంబర్ 25:** తెలంగాణలో రాగల ఐదురోజులు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈశాన్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కొనసాగుతుందని.. దానికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం సగటున సముద్రమట్టానికి 5.8 కిలోమీటర్ల వరకు విస్తరించిందని ఉందని పేర్కొంది. రాగల 24గంటల్లో పశ్చిమ-వాయువ్య దిశగా వాయువ్య బంగాళాఖాతం వైపు కదిలే అవకాశం ఉందని తెలిపింది. తూర్పు-మధ్య దానికి ఆనుకొని ఉన్న ఉత్తర బంగాళాఖాతం మీదుగా మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని తెలిపింది. 26వ తేదీ వరకు పశ్చిమ-మధ్య బంగాళాఖాతం, దక్షిణ ఒడిశా-ఉత్తరాంధ్ర తీర ప్రాంతాల్లో వాయుగుండంగా బలపడే అవకాశం ఉ ందని పేర్కొంది. 27వ తేదీ నాటికి తీరం దాటే అవకాశం ఉందని తెలిపింది. ఏపీ, తెలంగాణ మీదుగా సముద్రమట్టానికి ఉపరితల ఆవర్తనం కొనసాగుతుందని పేర్కొంది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో భారీ వర్షాలు పడే సూచనలున్నాయని వివరించింది. శుక్రవారం నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, వరంగల్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, నారాయణపేట, నారాయణపేట జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. అలాగే, శని-ఆదివారాల్లోనూ పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరించింది. ఇదిలావుంటే ములుగు జిల్లాల్లో వర్షం దంచి కొట్టింది. గురువారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా వాన పడుతున్నది. జిల్లాలోని వెంకటాపురం, వాజేడు, మంగపేట, ఏటూరు నాగారం, తాడ్వాయి, ములుగు, గోవిందరావుపేట, మల్లంపల్లి మండలాల్లో ఆగకుండా వాన కురిసింది. దీంతో వాగులు వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నారు. లోతట్టు- ప్రాంతాలు జలమయ మయ్యాయి. పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తారు వానలు పడుతాయని తెలిపింది. 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడుతుందని పేర్కొంది. శుక్రవారం ఆదిలాబాద్, కుమ్రం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. ఇక శనివారం భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు- తెలిపింది. నిర్మల్, నిజామాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. ఈ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది.

# గ్రూప్-1 విజేతలకు రేపు ఆర్డర్లు

## 563 మందికి నియామకపత్రాలు • అందించనున్న సీఎం • సీఎస్ వెల్లడి



**హైదరాబాద్, సెప్టెంబర్ 25 :** తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా ఎంపికైన గ్రూప్ -1 అభ్యర్థులకు ఈనెల 27న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిచే నియామక పత్రాలు అందించనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు వెల్లడించారు. శనివారం సాయంత్రం శిల్పకళా వేదికలో నిర్వహించనున్న కార్యక్రమం ఏర్పాట్లపై సంబంధిత ఉ న్నత అధికారులతో సీఎస్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రూప్-1 ద్వారా ఎంపికైన 563 మంది అభ్యర్థులకు అపాయింట్‌మెంట్ ఆర్డర్లు అందిస్తారని సీఎస్ తెలిపారు. దాదాపు 18 శాఖలకు చెందిన అభ్యర్థులు ఉన్నారు. ఈ కార్యక్రమానికి గౌరవ రాష్ట్ర మంత్రులందరినీ కూడా ఆహ్వానిస్తున్నట్టు సీఎస్ తెలిపారు. ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన కార్యక్రమం రేపటిలోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా ఈ కార్యక్రమానికి ఒక్కొక్క అభ్యర్థికి చెందిన ఇద్దరు కుటుంబ సభ్యులను అనుమతించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ నియామకాల్లో అత్యధికంగా, రెవిన్యూ, హోం, పంచాయతీరాజ్ శాఖలకు చెందిన వారే అధికంగా ఉన్నందున, రెవిన్యూ, హోం, జిఎడి కార్యదర్శులు ఈ కార్యక్రమ నిర్వహణలో సమన్వయంతో ఏర్పాట్లు- పూర్తి చేయాలని సీఎస్ ఆదేశించారు. నియామక పత్రాలు పొందే అభ్యర్థులు రాబోయే 30 సంవత్సరాలలో సర్వీస్ లో ఉంటారు కాబట్టి, వీరికి హార్థిక ఉత్తేజకరమైన వాతావరణంలో నియామక పత్రాలు అందచేయాలని, ప్రభుత్వ సర్వీస్ పట్ల వారికి ఉన్నత భావన కలిగేలా కార్యక్రమాన్ని నిర్వహించాలని అందుకు తగు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు సబ్యసాచి ఘోష్, వికాస్ రాజ్, హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవి గుప్తా, డీజీపీ జితేందర్, ముఖ్య కార్యదర్శులు బెనహర్ మహేష్ దత్ ఎక్కా, సందీప్ కుమార్ సుల్తానియా, కార్యదర్శులు లోకేష్ కుమార్, టీకే శ్రీదేవి, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్, సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ప్రియాంక తదితర అధికారులు పాల్గొన్నారు.

# అప్రమత్తంగా ఉండండి

మొదటి పేజీ తరువాయి

**హైదరాబాద్, సెప్టెంబర్ 25 :** తెలంగాణలో రానున్న రెండ్రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని శాఖల అధికారులను అప్రమత్తం చేశారు. వర్షాలపై నిరంతరం మానిటర్ చేయాలని సూచించారు. మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశముందని, నిరంతరం జాగ్రత్తగా ఉ ండాలని అధికారులను రేవంత్ ఆదేశించారు. అన్ని జిల్లాల కలెక్టర్లు హై అలెర్ట్‌గా ఉండి పరిస్థితిని సమీక్షించాలని కోరారు. అవసరమైతే లోతట్టు- ప్రాంతాల ప్రజలను ముందుగానే ఖాళీ చేయించి, పునరావాస కేంద్రాలకు తరలించాలని సూచించారు. అన్ని కాజ్ వేలను పరిశీలించాలని, రోడ్లపై వరద నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి ముందస్తుగానే ట్రాఫిక్‌ను క్లియర్ చేయాలన్నారు. విద్యుత్ శాఖ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అంతరాయం లేకుండా కరెంట్ సరఫరా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. వేలాడే వైర్లను తొలగించటంతో పాటు-, ఎలాంటి ప్రాణాపాయం జరగకుండా చూడాలన్నారు. దసరా సెలవులు ఉన్నప్పటికీ విద్యా సంస్థలు కూడా వర్షాలపై అప్రమత్తంగా ఉండాలని కోరారు. హైదరాబాద్‌లో జీహెచ్ఎంసీ, హైడ్రాతోపాటు ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఇదిలావుంటే హైదరాబాద్ నగరంలో మళ్లీ వర్షం మొదలైంది. గురువారం సాయంత్రం నగరంలోని పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. అమీర్ పేట్, పంజాగుట్ట, ఖైరతాబాద్, బేగంపేట, ప్యాటీ-÷-న, పారడైజ్, సికింద్రాబాద్, కోఠి, అబిడ్స్, చాదర్ ఘట్, మలక్ పేట్ తదితర ప్రాంతాల్లో వాన పడింది. గత వారం రోజులుగా అకాశమంతా మబ్బులుగా ఉంటూ అక్కడక్కడ వర్షం కురుస్తోంది. ఇక రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మరో రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ హెచ్చిరికలు జారీ చేసింది. ఈ క్రమంలో సిఎం రేవంత్ రెడ్డి వర్షాలపై స్పందించారు. రాష్ట్రంలో భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని జిల్లా కలెక్టర్లకు సిఎం రేవంత్‌రెడ్డి సూచించారు.

# దేవాదాయ శాఖ భూములను రక్షించండి

## హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కోరిన మంత్రి సురేఖ

**హైదరాబాద్,సెప్టెంబర్25 :** దేవాదాయ శాఖ భూముల పరిరక్షణ విషయంలో హైడ్రా సాయం చేయాలని రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కోరారు. దేవాదాయ శాఖ భూములు ఆక్రమణలకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వాటిని పరిక్షించేందుకు ఇప్పటికే డీజీపీఎస్ సర్వే చేపడుతున్నట్టు చెప్పారు. మంత్రి కొండా సురేఖతో గురువారం సచివాయలంలోని మంత్రి చాంబర్‌లో హైడ్రా కమిషనర్ రంగనాథ్ భేటీ- అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ బతుకమ్మ కుంట పునరుద్ధరణ విషయంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను మంత్రి అభినందించారు. బతుకమ్మ కుంట పునరుద్దరణ విజయంతంగా పూర్తి చేసినందుకు శభాష్ అంటూ కితాబు ఇచ్చారు. అయితే, తన పరిధిలో ఉన్న దేవాదాయ శాఖలోని భూముల పరిరక్షణకు హైడ్రా సాయం అవసరమని మంత్రి గుర్తు చేయగా ముఖ్యమంత్రి అనుమతితో చర్యలు తీసుకుంటామని రంగనాథ్ వివరణ ఇచ్చారు. అందుకోసం ప్రభుత్వ పరంగా శాఖ పరంగా కావాల్సిన సాంకేతిక అంశాలపై దృష్టి సారిస్తామని చెప్పారు. హైడ్రా వచ్చాక చేపట్టిన పనుల వివరాలను రంగనాథ్ మంత్రికి సమగ్రంగా వివరించారు. అయితే, మంచి పనులు చేసే సందర్భంగా కొన్ని ఇబ్బందులు ఎదరవుతాయని అన్నారు. కానీ సామూహిక ప్రయోజనంలో భాగంగా చేశారని మంత్రి సురేఖ కొనియాడారు. హైడ్రా చేస్తున్న పనులు రానున్న కాలంలో అందరికీ తెలుస్తాయని అన్నారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ వరంగల్ నాలాల ఆక్రమణలను కూడా రంగనాథ్‌తో చర్చించారు. వాటిని పరిష్కరించేందుకు తమకు సహకరించాలని కోరారు. అందుకు ఆయన సుముఖత తెలిపారు. కాగా, బతుకమ్మ కుంట వేడకులకు మంత్రి సురేఖను రంగనాథ్ ఈ సందర్భంగా ఆహ్వానించారు.



# ముగ్గురు బాలికలపై లైంగికదాడి

## ప్రేమ పేరుతో పరిచయం లేని యువకుల నయవంచన

## అల్వాల్ నుంచి యాదగిరిగుట్టకు తీసుకెళ్లి దారుణం

## చివరకు పోక్సో కింద జైలుకు

**హైదరాబాద్, సెప్టెంబర్ 25:** హైదరాబాద్‌లో మరో దారుణం వెలుగులోకి వచ్చింది. ప్రేమ పేరుతో ముగ్గురు బాలికలకు మాయమాటలు చెప్పి యాదగిరిగుట్టకు తీసుకెళ్లి అత్యాచారం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అల్వాల్‌కు చెందిన 9వ తరగతి చదువుతున్న ముగ్గురు విద్యార్థినులు, పాఠశాలలో బతుకమ్మ వేడుకలున్నాయని చెప్పి ఇంటి నుండి బయటకు వెళ్లారు. అయితే సాయంత్రం వరకు ఇంటికి తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందారు. ఈ క్రమంలో బాలికలు తార్నాక ప్రాంతంలో తిరుగుతుండగా, అక్కడే ముగ్గురు యువకులు వారిని ప్రేమిస్తున్నామని నమ్మించారు. నిందితులు జీహెచ్ఎంసీ కాంట్రాక్ట్ ఉద్యోగి మధు (19), ఒక షాపింగ్ మాల్లో పనిచేసే వంశీ (22), అలాగే పెట్రోల్ బంక్ ఉద్యోగి నీరజ్ (21)గా పోలీసులు గుర్తించారు. వీరు ముగ్గురు బాలికలను తన మాటలతో నమ్మబలికి, యాదగిరిగుట్టకు తీసుకెళ్లి అఘాయిత్యానికి పాల్పడ్డారు. తరువాత సాయంత్రం తార్నాకకు తిరిగి వచ్చిన బాలికలు తీవ్ర షాక్‌లో ఏడుస్తూ తమ తల్లిదండ్రులకు వివరాలు తెలియజేశారు. వెంటనే తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు బాలికలకు కౌన్సెలింగ్ నిర్వహించి, అత్యాచారం జరిగినట్టు నిర్ధారించారు. ప్రస్తుతం మధు, వంశీ, నీరజ్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు, పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటనతో ప్రాంతంలో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. మైనర్ బాలికలపై ఇటువంటి ఘటనలు పెరుగుతుండటంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసుల కఠిన చర్యలతోనే ఇలాంటి దారుణాలకు అడ్డుకట్ట పడుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
శుక్రవారం 26 సెప్టెంబర్ 2025





# ప్రజా జీవితానికి అంకితమై పని చేసిన కొంపల్లి వెంకట్

**డాక్టర్ చెరుకు సుధాకర్**



కాలం కాంక్షించి కలగన్న ప్రజా వీరుల వొడవని ముచ్చట్లను రికార్డు చేసి అక్షరీకరించి అందంగా పుస్తకంగా తీసుకొచ్చి ఇంకెంతో చేయవలసి ఉండగానే తన జీవితం ఒడిసిన ముచ్చటగా ముగించిండు... కవి రచయిత చరిత్ర రికార్డు చేయడంలో మొనగాడు నచ్చకపోతే నిర్మోహమాటంగా విమర్శించే కొంపల్లి వెంకట్ ఈరోజు ఉదయం చనిపోయినట్లు తెలిసింది.

మారోజు వీరన్న ఉన్న రోజుల్లో కూడా నల్లకుంటలో కనపడ్డప్పుడల్లా ఎన్నో విషయాలు నా సమ్మతితో సంబంధం లేకుండా చర్చించి మాట్లాడి వాగ్వాదానికి దిగి నాతోనే కాదు ఇంకా ఎంతో మందితో అదే పట్టుదలతో అట్లనే మాట్లాడి... ఇప్పుడు మాత్రం మనతో ఎవరికి ఏవి చెప్పకుండా మన మధ్యలో లేకుండా వెళ్లిపోయాడు వెంకట్.

మొన్న ఆ మధ్యనే వాళ్ళ అమ్మ చనిపోయినప్పుడు తనకున్న పరిమిత వనరుల మధ్య ఆ అంత్య క్రియల బాధ్యత కూడా కష్టమైనప్పుడు ఫోన్ చేసిండు. ఆ తర్వాత మళ్లీ వచ్చి కలుస్తా అన్నాడు అదే చివరి ఫోన్.

కవులు రచయితలు శరీరాన్ని సమాజం కోసం బలి పెట్టుకునేవాళ్ళు... వదిలించుకోలేని బలహీనతల బందీ అయితే అది ఎంత మందిని గమనిస్తుందో కలేకూరి ప్రసాదను ఇప్పుడు కొంపల్లి వెంకట్ ఇంకా చాలామంది నా జీవితంలో చూసిన.

ఒకసారి ఆచార్య గోపి నాతో అంటూ ఉండేవాడు.. అరేయ్ సుధాకర్! మనం బతకాలి అనుకున్న వాడు ఏదైనా అడిగితే ఎంతైనా చేయొచ్చు గాని.. ఊరికి ఊరికి సావులు ముద్దు పెట్టుకుంటా అంటే ఎంతగానో ఎన్ని రోజులు ఆపుతావు అంటుండే. ఆ మాట అలిశెట్టి ప్రభాకర్ బ్రతకడం కోసం ఈ మందులు ఆ మందులు పట్టుకుపోయి సరిగా వాడమని చెబుతున్నప్పుడు ప్రభాకర్ నిర్లిప్తత, నిరాసక్తత మీద కోపంతో నాతో అన్న మాట ఎంతమందికి వర్తించిందో వాళ్ల కోసం బతిమిలాడి అంబాడీ ఏది ముందుకు పడక ఇట్లాంటి చావు వార్త విన్న నాకు ఎక్కడ లేని ఆక్రోషం ఎప్పుడు కొంపల్లి వెంకట విషయంలో కూడా ఉంది. కర్మ సిద్ధాంతం.. వాడి ఆత్మకు శాంతి కలగాలని ఓం శాంతి అని రాయడం.. ప్రజల మనిషి అయితే అమర్ హై జోహార్ అని సరి పెట్టుకోవడం... నాకు తెలిసి పోలీస్ టార్చర్ కంటే కూడా దారుణంగా ఉంటుంది.

నల్లకుంట లోనే ఉండే భూపతి వెంకటేశ్వర్లు ఫోన్ చేసిన. బెల్లంకొండ చూస్తున్నాడు విషయాలు తెలిసిన తర్వాత మునగాల దగ్గర్లోని వారి ఊరు నరసింహాపురం తీసుకు రావడం లేదా ఇంకా విషయం ఏదైనా ఉంటే చెప్తా అన్నాడు.

హైదరాబాదులో ఉన్న మిత్రులు నాకు వెంటనే అప్డేట్ చేయండి. మిగతా విషయాలు దగ్గరుండి మన వర్తమాన చరిత్ర లేదా అసాధారణ పట్టుగలిగి అనేక విషయాలపై మహామవులతో పోటీ పడగలిగే ఒక ప్రగ్యాశాలి చరిత్రకారుడు కొంపల్లి వెంకట్ అంతిమ సంస్కారం కూడా గొప్పగానే జరగాలని కోరుకుంటున్నా.



## వీరుడా నీకు వందనం ...!

వీరుడా నీకు వందనం ...!
సర్దార్ వారసుడా నీకు అభివందనం
అస్థికోసం కాదు నీ పోరాటం ..!
ఆత్మ గౌరవం కోసం నీ ఆరాటం..!
పద నెక్కిన గీస కత్తిలా నీ మాటల తూటాలు
వ్యక్తుల కంటే వ్యవస్థ ముఖ్యమని బావించిన నీ భావజాలం ..
నిన్ను నిన్నుగా అర్థం చేసుకొని ఈ సమాజం ..
సర్దార్ సర్వాయి వారసత్వం కడదాక మోసుకున్నావ్
చరిత్ర లో పాపన్న గా పరిచయం అయ్యావ్ ..
పాపన్న చరిత్ర ఉన్నంత వరకు నీ రచనలు ప్రజల నాలుకల మీద నాట్యమాడుతుంటాయి...
ఓ కొంపల్లి నీకు కొట్టొక్క కన్నీటి వందనం ..
మనం కలిసిన 2002 – 25 మధ్యలో వందకు పైగా మన ముచ్చట్లు , చర్చలు ..
వాదోపవాదనలు ..ఎన్నో మన గత గుర్తులు .
సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చరిత్ర వెలుగులోకి తేవడంలో ఒక ప్రత్యేక స్థానాన్ని నిలబెట్టుకున్నావ్ ..
చివరగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ముఖ చిత్రం తేవడంలోనే కాదు ఆ పౌరుషంలో..
నువ్వే కనిపిస్తావ్ వెంకట్..
సర్దార్ ఆత్మ గౌరవం నిలబెట్టుకుందాం అంటూనే
ఆకాశంలో తారవయ్యావ్ ...
నీ దేహం ఓ ప్రయోగశాలైంది
నీ ఆలోచన ఓ పాఠ్యాంశంగా మారుతుంది ..
కన్నీటి శోక సంద్రంలో ...

**- యెలికట్టె విజయ్ కుమార్‌గౌడ్..**

## అశృనివాళి....!!

సాహితీవేత్త
సామాజిక రచయిత,
అభ్యుదయ వాది
ప్రొఫెసర్ జయశంకర్ గారి అనుభవాలతో
చవోడవనిబిముచ్చట
నీళ్లబికొట్లాట
చసర్దార్బిసర్వాయిపాపన్న చరిత్ర
లాంటి ఎన్నో పుస్తకాలను రచించాడు
"కొంపల్లి వెంకట్ గౌడ్"
శివైక్యం పొందారని తెలిసి
వారి ఆత్మకు శాంతి కలగాలని
భగవంతుడి ప్రార్థిస్తున్నాను...!!

**- తిరుమల కృష్ణ గౌడ్**
**బిజెపి రాష్ట్ర నాయకులు**





ఆత్మీయ మిత్రుడు, బహుజన మేధావి కొంపెల్లి వెంకట్ గౌడ్ మరణ వార్త నిజంగా దిగ్భ్రాంతికి గురించేసింది.సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవిత చరిత్రను మనముందుకు తీసుకువచ్చిన చరిత్ర కారుడు, ఓడువని ముచ్చట, నీళ్ల ముచ్చట, ధర్మబిక్షం గారి జీవిత చరిత్ర లాంటి చారిత్రత్మాకమైన, తెలంగాణ మట్టి మనుషుల చరిత్రలను పుస్తకాల రూపంలో మన ముందుకు తీసుకొచ్చిన నిఖార్సయినా తెలంగాణ వాది, బహుజన తత్వం నిలువెల్లా నింపుకున్న వెంకట్ అన్న మరణం నిజంగా తీరనిలోటు... వారం రోజులకు ఒకసారి ఫోన్ చేసే మీ ఫోన్ మూగబోయినట్లేనా అన్న... ఎందుకంత తొందరగా మమ్మల్ని విడిచివెళ్ళిపోయావు..ఆరోగ్యం జాగ్రత్త అన్న ప్రతిసారి మనకేం కాదు అనే నీ ధీమా ఎటుపోయింది మిత్రమా.... నువ్వు రాసిన పుస్తకాలను ఇచ్చి చదువు అన్నావు వాటిని చదివే లోగానే వెళ్ళిపోయావు... 2004 సాధారణ ఎన్నికల్లో మొదటి సారి పరిచయం అప్పటి నుండి ఇప్పటి వరకు సాగిన మన ప్రయాణానికి సెలవు... దిగంతాలలో ఉన్న గొప్ప వ్యక్తుల చరిత్రలు రాయడానికి వెళ్ళావా సోదరా.... ఇక సెలవు...

**- గొట్టి పర్తి శ్రీనివాస్ గౌడ్**
**ఎడిటర్, సలాం తెలంగాణ.**

## నా నాయకత్వ లక్షణాలకు కొంపెల్లి పదును పెట్టాడు

నేను పట్నం వచ్చిన కొత్తలో పరిచయమయిన వ్యక్తి కొంపల్లి వెంకట్ గౌడ్ అన్న... నా నాయకత్వ లక్షణాలకు పదును పెట్టేంది కూడ ఆయనే ఒక నాయకుడు ఎలా ఉండాలో,ఎలా ఉండకూడదో నిత్యం సలహాలు, సూచనలు ఇస్తూ నేను ఈ స్థాయికి రావడానికి ఎంతో దోహద పడ్డడు

బిసి ఉద్యమం బలపడటానికి బిసి సాహిత్యం ఉండాలని పట్టుబట్టి కోదారీ శీనన్న,అంబటి వెంకన్న, గోరటి వెంకన్న, గూడ అంజన్నలతో పాటలు వ్రాయించి బిసి పాటలను ఉద్యమంలో భాగం చేసిండు నేను చట్ట సభలలో ఉండాలని నాపై అనేక అర్టికల్స్ వ్రాసిండు...

వెంకన్నకు నాకు ఉన్న బంధం జన్మ జన్మల అనుబంధం అందుకే ఈరోజు పొద్దుగాల అన్న మరణించండని పిడుగు లాంటి వార్త విన్న తర్వాత... నా గుండె లోతుల్లో మౌన రోదన వారి గురించి వ్రాయాలంటే అస్సలు మనస్సు స్తిమితం కావడం లేదు, నా జీవితంలో మరువ లేని,మరుపు రాని వ్యక్తి కొంపల్లి వెంకట్ గౌడ్ అన్న, నీ స్నేహం,నీ జ్ఞాపకాలు,నీతో గడిపిన రోజులను నేను జీవించి ఉన్నంతకాలం నా గుండెల్లో పదిలంగా దాచుకుంట మీ సూటి తత్వం, మీ ముందుచూపు, మీ నిక్కచ్చితనం, మీ స్పష్టమైన అభిప్రాయం మాకు ఆదర్శనీయం వెంకన్న నీకు మరణం లేదు

అందుకే నీ దేహాన్ని గాంధీ మెడికల్ కాలేజీకి సొంతంచేసి సజీవంగా జీవించే ఉన్నం కడసారి కన్నీటి నివాళులు అర్పింస్తున్న జోహార్ కొంపల్లి వెంకట్ గౌడ్ అన్న, జోహార్, జోహార్

**- జాజుల శ్రీనివాస్ గౌడ్**
**జాతీయ అధ్యక్షులు,**
**బీసీ సంక్షేమ సంఘం.**

## కొంపెల్లి వెంకట్ గౌడ్ - చరిత్రకెక్కని చరితార్థుడు



వెంకన్న అకస్మాత్తుగా మరణించడం మనసును ఎంతగానో కలచివేసింది. తీవ్రంగా బాధించింది. చివరి చూపుకు నోచుకోని వారిలో నేనొకడిని. అది కూడా బాధిస్తోంది ఆయన నిద్రలో పోవడం, బాడీని పరిశోధనల నిమిత్తం ఇవ్వడం, రెండూ కూడా ఎందుకో ఆయన అనుసరించిన నిశ్శబ్దానికి, సమాజానికి ఉపయోగపడే పరిశోధనా తత్వానికి తార్కాణాలుగా అనిపించాయి. అంతేకాదు, తనకంటూ ఎవరూ లేరన్న సంకేతమేదో ఇవి చెప్పకనే చెబుతున్నవి. చాటుతున్నవి. అనేక విధాల పీడన, అణచివేత, విస్మృతికి గురైన తెలంగాణలో మలిదశ ఉద్యమం గొప్ప చేతనను కలిగించింది. రాష్ట్రం ఏర్పడితే ఎన్నో విధాలా బాగుపడుతాం అన్న ఆశలు రెకెత్తాయి. రాష్ట్రంతో పాటు మన అందరం కూడా ఎదుగుతాం అన్న భోరోసా ఉండింది. స్వీయ అస్తిత్వంతో సకల రంగాలు పూర్వపక్షమై తెలంగాణ మరింత సమున్నతంగా రాణిస్తుందని అరాట పడ్డాం. అందుకే తెలంగాణ స్వభావమే అది అన్నట్టు ఎంతో మంది వ్యక్తులే గొప్ప సంస్థలుగా పనిచేశారు. రాష్ట్రం ఏర్పడింది. కానీ వారి కృషికి సమాజంలోకి పెద్ద ఎత్తున పోనేలేదు. అంతకన్నా ముఖ్యంగా స్వతంత్రత సాధించిన రాష్ట్రం – మన పాలకులు సంస్థలుగా పనిచేసిన వ్యక్తులను అక్కున చేర్చుకున్నది లేదు. ఆత్మ గౌరవంగల వ్యక్తులను కాకుండా బానిస మనస్తత్వం ఉన్న వారే ఏదో విధంగా గుర్తింపు, గౌరవం, ప్రాధాన్యతలు దక్కించుకుని చరిత్ర నిర్మాతలు తామే అని ఊరేగడం కళ్ళారా చూశాం. చూస్తూనే ఉన్నాం. తమ కృషిని మరింత ఉన్నతంగా రాణించడానికి స్వరాష్టం వెన్నుదన్నుగా నిలుస్తుందని ఆశించిన వారంతా బంగపడ్డారు.రాష్ట్రం ఏర్పడింది. ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉంది. దాంతో వీరు ఆగిపోలేదు. వ్యక్తులుగా మునుపటి స్థితిలోనే బ్రతుకుతూ తమంతట తాము ఉత్సాహం రంగరించుకుని పనిచేయవలసిన అగత్యం ఏర్పడింది. అందువల్ల వారిలో చెప్పనలవి కానంత దు:ఖం.. బాధ...లోవెలుపలా ఘర్షణ...వైయుక్తికం కాని అనారోగ్యం. చికిత్సకు అందనట్టు కనిపించే రంది.

ఒక వంక స్థిరపడని జీవితాలు. మరో వంక వనరుల లేమి. ఎటూ తోడ్పాటు లేని స్థితి. నైరాశ్యం. కానీ, మునుపటి మాదిరే అదే స్థితిలో ఉంటూ మరింత ఉత్సాహంతో పనిచేయవలసి రావడం విషాదాల్లో కెల్లా విషాదం. ఇంత జరిగినా నోరెత్తి తమ నిరసన చెప్పకుండా తమ మానాన తాము పనిచేసుకుంటూ వెళ్ళిన వారిలో ఒకరు మన వెంకన్న. నిరంతర ప్రశ్నగా, తానే సమాధానంగా బ్రతికిన అరుదైన వ్యక్తుల్లో కొంపెల్లి వెంకట్ గౌడ్ ఒక అసాధారణుడు. దోస్తులు, ఆత్మీయుల సౌజన్యమే బలంగా బ్రతికిన వంటరి యోధుడు. ప్రొ. జయశంకర్ సార్, ఆర్. విద్యాసాగర్ రావు గారు, బొమ్మగాని ధర్మబిక్షం గారు, నోముల సత్యనారాయణ గారు. ఈ నలుగురిపై వెంకన్న నాలుగు పుస్తకాలు తెచ్చారు. అవన్నీ జీవిత చరిత్రలు. ఆత్మ కథలే. అలాగే వారి అతి ముఖ్యమైన గ్రంథం సర్వాయి పాపన్న గౌడ్ చరిత్రపై పరిశోధనా రచన. ఇవన్నీ ఒకడే ఒక సైన్యంగా తెచ్చిన యోధుడతను. వ్యక్తిగతం కాదు, సామాజిక మరణాలలో ఇది కూడా ఒకటి. గుండెపోటు అన్నారు. నలుగురి కోసం కొట్టుకునే గుండె అది. అది గుర్తుండాలి ఇది నా పర్సనల్ ఫీలింగ్. ఇలా ఆలోచించే వారూ ఉంటారనే అనుకుంటున్నాను. ఏంతో భవిశ్వత్తు ఉండి నడిమంత్రాన ఇలా ఒడిసిపోయే ముచ్చటగా మిగలాల్సిన వాడు కాదు వెంకన్న అని మల్లోసారి నొక్కి చెబుతూ తన పేరిట వ్యక్తులు, చరిత్రని తవ్వి తీసేందుకు గాను పరిశోధనా సంస్థ ఒకటి వెలియడం తెలంగాణకు అవశ్యం, శిరోధార్యం. కనీసం ఇప్పటికైనా చేయదగ్గ స్మరణ.

**-కందుకూరి రమేష్ బాబు, సామాన్య శాస్త్రం గ్యాలరీ**

# తెలంగాణ సామాజిక చారిత్రక సాహితీవేత్త కొంపల్లి వెంకట్

**మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్**




తెలంగాణ సామాజిక చారిత్రక సాహితీవేత్త, ప్రముఖ రచయిత కొంపెల్లి వెంకట్ గౌడ్ మరణం పట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సంతాపం ప్రకటించారు. ప్రొఫెసర్ జయశంకర్ గారితో సంభాషణ, వొడువని ముచ్చట, పుస్తకం ద్వారా తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అనుసరించాల్సిన రాజకీయ భావజాలాన్ని వ్యాప్తిచేసిన ఉద్యమ రచయిత కొంపెల్లి అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న చరిత్రను రికార్డు చేసి వెలుగులోకి తెచ్చి, బీసీల రాజకీయ చైతన్యం కోసం పాటుపడిన ఘనత కొంపెల్లిదేనని.. వారితో తనకున్న అనుబంధాన్ని కేసీఆర్ గుర్తు చేసుకున్నారు. తెలంగాణవాదిగా, బహుజన వర్గాల అభ్యున్నతిని కాంక్షిస్తూ పలు రచనలు చేసిన వెంకట్ గౌడ్ అకాల మృతి తెలంగాణ సాహితీ లోకానికి తీరని లోటని విచారం వ్యక్తం చేశారు. వారి మరణంతో శోకతప్తులైన కుటుంబ సభ్యులు మిత్రులకు కేసీఆర్ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

**ప్రముఖ రచయిత, తెలంగాణ వాది, సామాజిక ఉద్యమకారులు, బహుజన విప్లవ కారులు,కొంపెల్లి వెంకట్ గౌడ్ మృతి పట్ల సంతాపం తెలియజేస్తూ..,**



ప్రముఖ రచయిత, తెలంగాణ మట్టిబిడ్డ శ్రీ కొంపల్లి వెంకట్ గౌడ్ గారు ఇక లేరన్న వార్త తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. వారి హఠాన్మరణం తెలంగాణ సాహిత్య రంగానికి, తెలంగాణ ప్రజలకు తీరని లోటు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ, వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. ప్రొఫెసర్ జయశంకర్ గారి జీవితాన్ని, అనుభవాలను "వొడువని ముచ్చట"గా తెలంగాణ ప్రజలకు అందించిన వెంకట్ గారు మరోవైపు ఆర్. విద్యాసాగర్ రావు గారి ఆలోచనలను "నీళ్ల ముచ్చట"గా పుస్తక రూపంలోకి తీసుకొచ్చి ఇద్దరు మహానుభావుల ఆలోచనలను శాశ్వతంగా పదిల పరిచారు. వీరితో పాటు ప్రముఖ సాహితీవేత్త నోముల సత్యనారాయణ వంటి ప్రముఖుల జీవితాలను కూడా గ్రంథస్తం చేశారు. తన జీవితకాలం ఆద్యంతం తెలంగాణ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కొంపల్లి వెంకట్ గౌడ్ గారు పోషించిన పాత్ర అద్వితీయం.అంతే కాకుండా, తన రచనల ద్వారా బడుగు బలహీన వర్గాలకు అన్ని విధాలుగా అభ్యున్నతి కలగాలన్నఆలోచన విధానంతో తన సాహిత్య జీవితాన్ని సాగించారు. గౌడన్నల ఆత్మగౌరవాన్ని చాటి చెప్పి, సర్వాయి పాపన్న చరిత్రను అక్షరబద్ధం చేసి ఈ తరానికి అందించారు. తెలంగాణ తత్వం, ఉద్యమ స్ఫూర్తిని తన కలంలో నింపుకొని ఎన్నో రచనలు చేసిన ఆయన కృషి చిరస్మరణీయం. వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ, వారి కుటుంబ సభ్యులకు ఈ దుఃఖాన్ని తట్టుకునే శక్తిని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను.

**- సూద గాని ఉదయ్**

## కొంపెల్లి వెంకట్ గౌడ్‌కు కన్నీటి నివాళి



నిరంతరం బహుజనుల చైతన్యం కోసం పరితపించిన కొంపెల్లి వెంకట్ గౌడ్ గుండె ఆగిపోయింది. ఆధిపత్య కులాల వారి ఆగడాలను ఎలాంటి శషభిషలు లేకుండా దునుమాడిన కలమది. పోరాట యోధుడు సర్వాయి పాపన్న, నీళ్ల విద్యాసాగర్ రావు, ఆచార్య జయశంకర్, నల్లగొండ నడిచే విజ్ఞాన సర్వస్వము నోముల సారు, బహుజన యోధుడు బొమ్మగాని ధర్మ భిక్షం తదితరులను చరిత్రలో తన అక్షరాల్లో బతికించిండు. నల్లగొండ నీలగిరి కవులనుంచి బయల్దేరి తెలుగు కవితాకాశములో తారగా వెలిగిండు. బిసిలకు అన్యాయం చేసిన వారినెవ్వరిని స్పేర్ చెయ్యలేదు. అది సొంత కులం వారయితే మరింత విమర్శనాత్మకంగా ఉండేవాడు. అంటే మార్పు మనదగ్గరే మొదలు కావాలి అనేవాడు. బహుజన సాహిత్య చరిత్ర విశ్లేషణలో భాగంగా గౌడ సాహిత్యం గురించి రాస్తూ మిత్రమా నాకు తెలిసినవి ఈ పేర్లు, ఇవి గాకుండా ఇంకెవ్వరున్నారు అని అడిగితే టకటకా ఓ రెండు డజన్ల పేర్లు చెప్పిండు. ఎప్పటి నుంచో ఈ విషయమై పరిశోధన చేస్తూ ఉన్నవాడు కావడముతో అంతా నోటికి చెప్పేసిండు. కాకతీయ యూనివర్సిటీలో ఎమ్మె ఇంగ్లీష్ చదివినా ఉద్యోగం పై కన్నా ఉద్యమాల పైనే ఎక్కువ ఆసక్తి ఉండేది. తానెంత లోతులో ఉన్నాడో తనకు కచ్చితంగా తెలుసు. తాను ఏమి చేయాల్సింది ఉందో కూడా బాగా తెలుసు. అందుకే సర్వాయి పాపన్న అసలు చరిత్రను ఆధారాలతో సహా సేకరించే, సమగ్రంగా రాసే పనిలో ఉన్న సమయములో ఈ విషాదము జరగడం తెలంగాణాకు, బహుజన సాహిత్యానికి, చరిత్రకు, మిత్రులకు తీరని లోటు. అన్నింటిని క్రిటికల్ గా చూసే ఆత్మీయ మిత్రుడికి కన్నీటి నివాళి. – సంగిశెట్టి శ్రీనివాస్

## తెలంగాణ మట్టిబిడ్డ



ప్రముఖ రచయిత శ్రీ కొంపల్లి వెంకట్ గౌడ్ గారు ఇక లేరన్న వార్త తీవ్ర విషాదానికి గురి చేసింది. వారి హఠాన్మరణం తెలంగాణ సాహిత్య రంగానికే కాదు, మొత్తం తెలంగాణ సమాజానికీ, ముఖ్యంగా గౌడన్నలకు తీరని లోటు. ఆయన గౌడన్నల ఆత్మగౌరవాన్ని చాటుతూ, "సర్వాయి పాపన్న గౌడ్"చరిత్రను శాశ్వతంగా పుస్తకం అక్షరబద్ధం చేశారు. అంతేకాక, ప్రొ. జయశంకర్ సర్ "ఒడవని ముచ్చట", విద్యాసాగర్ రావు గారి ఆలోచనలను "నీళ్ల ముచ్చట", గా పుస్తక రూపంలో నిలబెట్టి, నోముల సత్యనారాయణ వంటి సాహిత్య ప్రముఖుల జీవితం, కృషిని కూడా గ్రంథస్తం చేశారు. తన రచనల ద్వారా తెలంగాణ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆయన పాత్ర అపూర్వం. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే తన సాహిత్య లక్ష్యమని నిరూపించారు. తెలంగాణ తత్వం, ఉద్యమ స్ఫూర్తి ప్రతి రచనలో ప్రతిధ్వనించేలా చేశారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని మనసారా కోరుకుంటూ, కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.

– రవిచంద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
శుక్రవారం 26 సెప్టెంబర్ 2025



# జీఎస్టీ సంస్కరణలు ప్రజలకు దసరా-దీపావళి కానుక

## భువనగిరి మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్య గౌడ్

## ధరల తగ్గింపుతో మధ్యతరగతికి ఆర్థిక ఉపశమనం: చేర్యాలలో బీజేపీ నేత బూర నర్సయ్య గౌడ్ ప్రసంగం



చేర్యాల,రోమింగ్ న్యూస్: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న తాజా జీఎస్టీ (%+గూ%) సంస్కరణలు ఈ దసరా, దీపావళి పండుగల వేళ పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు అందిస్తున్న ప్రత్యేక బహుమతి అని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ అన్నారు. చేర్యాల పట్టణంలోని పీఎంఆర్ గార్డెన్‌లో నిర్వహించిన జీఎస్టీ సంస్కరణల అవగాహన సదస్సులో శుక్రవారం ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సంస్కరణల ద్వారా ప్రజలకు నేరుగా లాభాలు అందుతున్నాయని డాక్టర్ నర్సయ్య గౌడ్ తెలిపారు. ముఖ్యంగా, వస్తువుల ధరల్లో తగ్గింపు ఉంటుందని, తద్వారా పండుగ సమయంలో గృహాల ఆర్థిక భారం గణనీయంగా తగ్గుతుందని ఆయన వివరించారు.

**18% నుంచి 12% స్లాబ్‌కు తగ్గింపు %-% ప్రజలకు పెద్ద ఊరట**

జీఎస్టీ కౌన్సిల్ తీసుకున్న నిర్ణయాలను వివరిస్తూ, గతంలో 18% స్లాబ్‌లో ఉన్న కొన్ని ముఖ్యమైన వస్తువులు, వినియోగదారులకు అవసరమైన సేవలను ఇప్పుడు 12% స్లాబ్‌కు తగ్గించడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ మార్పుల ఫలితంగా ఆయా వస్తువుల ధరలు దిగివస్తాయని, తద్వారా పండుగల సీజన్‌లో ప్రజలకు భారీ ఆర్థిక ఉపశమనం లభిస్తుందని నర్సయ్య గౌడ్ పేర్కొన్నారు. అదేవిధంగా, దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నుముకగా నిలుస్తున్న చిన్న, మధ్య తరహా వ్యాపారాలకు (MSMEs) కూడా కేంద్రం ఎంతో సౌలభ్యాన్ని కల్పించిందని ఆయన తెలిపారు. MSMEs రిటర్న్లు దాఖలు చేసే ప్రక్రియను మరింత సులభతరం చేసి, కాంప్లయెన్స్ భారాన్ని తగ్గించడం ద్వారా వ్యాపార అభివృద్ధికి తోడ్పాటు అందించామని చెప్పారు.

**ప్రజల సంక్షేమానికే బీజేపీ కట్టుబడి ఉంది**

"ప్రతి చిన్న కష్టాన్ని తగ్గించడానికి, ప్రతి పౌరుడి జీవన ప్రమాణాలు మెరుగుపరచడానికి కేంద్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోంది" అని డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ స్పష్టం చేశారు. జీఎస్టీ సంస్కరణ లు కేవలం పన్నుల విధానాన్ని సరళతరం చేయడమే కాకుండా, పారదర్శకతను పెంచి, వ్యవస్థీకృత ఆర్థిక వృద్ధికి దోహద పడుతున్నాయని ఆయన అన్నారు. పండుగల వేళ కూడా సామాన్య కుటుంబాలు సంతోషంగా గడిపేలా చూడటమే బీజేపీ లక్ష్యం అని ఆయన పునరుద్ఘాటించారు.

# సాదుల మధుసూదన్‌కు ప్రతిష్ఠాత్మక 'గ్లోబల్ గ్రీన్ మెంటార్ అవార్డు 2025'




న్యూయార్క్ సిటీ, రోమింగ్ న్యూస్: 80వ ఐక్యరాజ్యసమితి (UN) సాధారణ సభ సందర్భాన్ని పురస్కరించుకుని, పర్యావరణ సంరక్షణ మరియు సుస్థిర వాతావరణ విద్యా కార్యక్రమాలలో అత్యుత్తమ కృషి చేసినందుకు గాను హైదరాబాద్ ప్రగతి విద్యానికేతన్ మరియు కార్డినల్ గ్రేషియస్ హైస్కూల్స్ చైర్మన్ సాదుల మధుసూదన్ కు ప్రతిష్ఠాత్మకమైన 'గ్లోబల్ గ్రీన్ మెంటార్ అవార్డు 2025' లభించింది.

క్లైమేట్ వీక్ NYCలో అధికారిక భాగంగా, గ్రీన్ మెంటర్స్ ఆధ్వర్యంలో న్యూయార్క్ నగరంలో నిర్వహించిన 9వ NYC గ్రీన్ స్కూల్ కాన్ఫరెన్స్ 2025లో ఈ అవార్డును ప్రదానం చేశారు.

**సుస్థిర విద్యపై కీలక చర్చ**

సెప్టెంబర్ 23 మరియు 24 తేదీలలో జరిగిన ఈ రెండు రోజుల సదస్సులో ప్రపంచవ్యాప్తంగా 300 మందికి పైగా ప్రముఖులు పాల్గొన్నారు. వీరిలో మంత్రులు, విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్లు, ఐక్యరాజ్యసమితి అధికారులు, యువ నాయకులు మరియు వాతావరణ ఆవిష్కర్తలు ఉన్నారు. ఈ సమావేశంలో "గ్రీన్ ఎడ్యుకేషన్ ఫర్ పీపుల్, ప్లానెట్ అండ్ ప్రాస్పెరిటీ" (ప్రజలు, భూమి మరియు శ్రేయస్సు కోసం హరిత విద్య) అనే ప్రధాన అంశంపై 20కి పైగా సెషన్లలో విస్తృతంగా చర్చలు జరిపారు.

**తెలంగాణ పాఠశాలల్లో SDGల అమలు**

అవార్డు అందుకున్న సందర్భంగా, TRSMA (తెలంగాణ రాష్ట్ర ప్రైవేట్ పాఠశాలల జాయింట్ యాక్షన్ కమిటీ) అధ్యక్షులుగా ఉన్న మధుసూదన్ కీలక ప్రకటన చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని పాఠశాలల్లో ఐక్యరాజ్యసమితి నిర్దేశించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను (SDGs) పాఠ్యాంశాలలో అనుసంధానిస్తామని ఆయన ప్రకటించారు.

పాఠశాలల్లో సుస్థిర ఆచరణలను ప్రోత్సహించడానికి మరియు అమలు చేయడానికి, ఉపాధ్యాయుల సామర్థ్య వృద్ధి కోసం ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమాల నిర్వహణలో UNESCO IESALC (యూనెస్కో ఉన్నత విద్య కోసం లాటిన్ అమెరికా మరియు కరీబియన్ ఇన్స్టిట్యూట్) మరియు UN DESA (ఐక్యరాజ్యసమితి ఆర్థిక, సామాజిక వ్యవహారాల విభాగం) సంస్థల భాగస్వామ్యం మరియు సహకారం ఉంటుందని ఆయన వివరించారు.

**భవిష్యత్ తరాల కోసం సుస్థిరత**

ఈ సందర్భంగా మధుసూదన్ మాట్లాడుతూ, "భవిష్యత్ తరాల కోసం వాతావరణ సుస్థిరత చాలా కీలకం. ఈ బాధ్యత మనందరిపై ఉంది. ఈ ప్రతిష్ఠాత్మకమైన గ్లోబల్ గ్రీన్ మెంటార్ అవార్డు అందుకోవడం నిజంగా గర్వకారణం. పిల్లల భవిష్యత్తు వెలుగులు నిండినదిగా ఉండాలంటే, మనం ఈరోజే విద్యలో సుస్థిర ఆచరణలకు ప్రాధాన్యతనివ్వాలి" అని ఉద్ఘాటించారు. సమావేశం ముగింపులో ప్రపంచవ్యాప్తంగా వచ్చిన పిల్లలు తమ సందేశాన్ని వినిపించారు, భవిష్యత్తు పర్యావరణ హిత నాయకుల చేతుల్లోనే ఉందని గుర్తు చేశారు. మధుసూదన్ కృషి దేశంలోని ఇతర విద్యాసంస్థలకు స్ఫూర్తిదాయకం.

# జనగామలో స్టేట్ లెవెల్ ఫుట్బాల్ పోటీలు

## ప్రారంభించిన కలెక్టర్ పింకేష్ కుమార్



జనగామ, సెప్టెంబర్ 25: (రోమింగ్ న్యూస్)

జనగామ జిల్లా కేంద్రంలో 69వ తెలంగాణ రాష్ట్ర ఇంటర్ డిస్ట్రిక్ట్ ఫుట్బాల్ ఛాంపియన్షిప్ పోటీలు ఘనంగా ప్రారంభం అయ్యాయి 69వ రాష్ట్రస్థాయి ఎస్ జి ఎఫ్ ఉమ్మడి వరంగల్ జిల్లాల ఫుట్బాల్ అండర్ 19 సంవత్సరాల కళాశాల బాలుర ఫుట్బాల్ క్రీడలను

జనగామ మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రావు సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ తో కలిసి జిల్లా జాయింట్ కలెక్టర్ పింకేష్ కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. పది జిల్లాల నుండి వచ్చిన క్రీడాకారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ... ఆటలతో ఆరోగ్యం బలపడుతుందని దేశ ప్రతిష్ట పెరుగుతుందని, మంచి ప్రతిభ కనబరిచి తెలంగాణ రాష్ట్రం నుండి జాతీయస్థాయిలో గెలుపొంది రాష్ట్రానికి జిల్లాకు మంచి పేరు తేవాలన్నారు. కల్నల్ డాక్టర్ బిక్షపతి మాట్లాడుతూ విద్యార్థులంతా ఆటలలో రాణించాలంటే ప్రతిభ చూపాలని, అందుకు దృడంగా, ఆరోగ్యంగా ఉండాలని, ప్రతి రోజు వ్యాయామం ఆటలు ఆడటం తప్పనిసరి గా పెట్టుకోవాలన్నారు. దేశ సేవలో క్రీడాకారుల పాత్ర నేటి యువతకు మంచి నడవడిక కావాలని, సెల్ ఫోన్ కి దూరంగా ఉండాలని, మత్తుమందులకు, మత్తు పానీయాలకు డ్రగ్స్ కు దూరంగా ఉండాలన్నారు. 27వ తేదీ వరకు 10 జిల్లాల నుండి వచ్చిన క్రీడాకారులు స్పోర్ట్స్ మెన్ స్పిరిట్ తో ఆటలాడి మంచి క్రీడాకారులుగా గుర్తింపు పొందాలన్నారు

ఈ కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమ అధికారి డాక్టర్ విక్రమ్ కుమార్, జనగామ జిల్లా ఫుట్బాల్ క్రీడల సెక్రటరీ అజ్మీర కిషన్, దాతలు వేలాద్రి, వ్యాయామ ఉపాధ్యాయ టీజీఎఫ్ జిల్లా అధ్యక్షులు కోల్ సింగ్ , అసోసియేట్ అధ్యక్షులు శ్రీనివాస్ , వివిధ జిల్లాల నుండి విచ్చేసిన ఫుట్బాల్ కోచస్ అలాగే సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ స్టాఫ్ ప్రెసిడెంట్ కె వేణుమాధవ్, క్రీడాభి మాన్లు క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



# గోరేటి వెంకన్నకు గౌరవ డాక్టరేట్ ప్రధానం

## తెలంగాణా వాగ్గేయకారుడు గోరేటి వెంకన్న



హైదరాబాద్, రోమింగ్ న్యూస్: తెలంగాణా గడ్డ నుంచి వచ్చి, తన సాహిత్యంతో, పాటలతో కోట్లాది ప్రజల హృదయాలను గెలుచుకున్న ప్రఖ్యాత కవి, గాయకుడు, వాగ్గేయకారుడు గోరేటి వెంకన్నకు అరుదైన గౌరవం దక్కింది. ఆయన సాహితీ సేవను గుర్తించిన డా. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్‌ను ప్రకటించింది. ఈ నెల 30వ తేదీన విశ్వవిద్యాలయంలో జరగనున్న స్నాతకోత్సవంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఈ గౌరవ డాక్టరేట్‌ను గోరేటి వెంకన్నకు ప్రదానం చేయనున్నారు. ఇది తెలంగాణా సంస్కృతిని, ప్రజా జీవనాన్ని తన పాటల్లో ప్రతిబింబించిన ఒక గొప్ప సాంస్కృతిక సేనానికి దక్కిన అత్యున్నత గౌరవంగా భావించవచ్చు.

గోరేటి వెంకన్న కృషి, సాహిత్య సేవ గోరేటి వెంకన్న పాటలు కేవలం వినోదాన్ని పంచేవి కావు, అవి తెలంగాణా పల్లె జీవితాన్ని, ప్రకృతిని, సామాజిక సమస్యలను, కష్టాలను, ఆశలను అద్దం పట్టిన జీవన గానాలు.

ప్రజల కవి: గ్రామీణ వాతావరణం, మట్టి వాసన, వ్యవసాయం, పేదరికం వంటి అంశాలను ఆయన తన పాటల్లో ఆత్మీయంగా పలకరించారు. ఆయన పాటల్లోని పదాలు అత్యంత సరళంగా ఉంటూనే, లోతైన భావాన్ని కలిగి ఉంటాయి.

విశిష్ట రచనలు: ఆయన రచించిన 'కొండమీది చంద్రవంక', 'పూసిన పున్నమి' వంటి పాటలు, 'రేల పూతలు', 'ఎలుగు జిలుగు' వంటి కవితా సంకలనాలు ఆయన సాహితీ ప్రతిభకు నిదర్శనం. సినిమా రంగంలో: సినీ గీత రచయితగానూ ఆయన అందించిన పాటలు ఎంతో ప్రాచుర్యం పొందాయి.

**దక్కిన అవార్డులు**

- సాహిత్యం, కళారంగంలో గోరేటి వెంకన్న చేసిన కృషికి అనేక పురస్కారాలు లభించాయి.
- కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు: ఆయన 'వల్లంకి తాళం' అనే కవితా సంకలనానికి గాను కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది.
- కళారత్న (హంస) అవార్డు: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి కళారత్న (హంస) పురస్కారాన్ని అందుకున్నారు.
- తెలంగాణ రాష్ట్ర స్థాయి అవార్డులు: రాష్ట్ర ఆవిర్భావం తరువాత ఆయన సేవలను గుర్తించి తెలంగాణ ప్రభుత్వం కూడా పలు అవార్డులతో సత్కరించింది.
- తెలంగాణా సాంస్కృతిక వైభవ ప్రతీక అయిన బతుకమ్మ పండుగ సందర్భంగా ఆయనకు లభించిన ఈ గౌరవ డాక్టరేట్, గోరేటి వెంకన్నకు మాత్రమే కాక, తెలంగాణా ప్రజా జీవితాన్ని, సంస్కృతిని సజీవంగా ఉంచుతున్న కళాకారులందరికీ దక్కిన గౌరవంగా భావిస్తున్నాం.

# కోమటిరెడ్డి గోపాల్ రెడ్డికి గ్లోబల్ గ్రీన్ మెంటర్ అవార్డు





న్యూయార్క్ సిటీ, రోమింగ్ న్యూస్: హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ విద్యావేత్త, లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్స్ చైర్మన్ డాక్టర్ కొమటిరెడ్డి గోపాల్ రెడ్డి కి ప్రతిష్టాత్మక "గ్లోబల్ గ్రీన్ మెంటర్ అవార్డు 2025" లభించింది. పర్యావరణ విద్యకు, సంరక్షణకు ఆయన చేసిన విశేష సేవలకు గుర్తింపుగా ఈ అవార్డును న్యూయార్క్ లో ప్రదానం చేశారు. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ సందర్భంగా, 9వ NYC గ్రీన్ స్కూల్ కాన్ఫరెన్స్ - 2025 జరిగింది. ప్రపంచవ్యాప్తంగా మంత్రులు, శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు ఇందులో పాల్గొని 'పర్యావరణ విద్య' గురించి చర్చించారు. ఈ అంతర్జాతీయ వేదికపైనే డాక్టర్ గోపాల్ రెడ్డి కి ఈ అరుదైన గౌరవం దక్కింది.

**డాక్టర్ గోపాల్ రెడ్డి సేవలు:**

- లోటస్ ల్యాప్ స్కూల్స్‌లో ప్లాస్టిక్ రహిత వాతావరణం, నీటిని ఆదా చేయడం, చెట్లు నాటడం, చెత్తను వేరు చేయడం, కిచెన్ గార్డెన్‌ల ఏర్పాటు వంటి పర్యావరణ పద్ధతులను అమలు చేశారు.
- పిల్లల్లో స్టీల్ వాటర్ బాటిల్స్ వాడకాన్ని, 'నో క్రాకర్స్ దివాలీ' వంటి కార్యక్రమాలను ప్రోత్సహించారు.
- విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అందరూ కలిసి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని నిరంతరం ప్రేరణ ఇస్తున్నారు.
- మాసాచుసెట్స్ హౌస్ ఆఫ్ రెప్రజెంటేటివ్స్ స్టేట్ రెప్రజెంటేటివ్ డాక్టర్ ట్రామ్ న్యూగెన్ (USA) మరియు యునెస్కో IESALC ప్రధాన అధికారి శ్రీమతి బోసెన్ లిల్లీ లియు (%ఖచీూ%) సంయుక్తంగా ఈ అవార్డును అందించారు.

ఈ సందర్భంగా డాక్టర్ గోపాల్ రెడ్డి మాట్లాడుతూ, "గ్రీన్ ఎడ్యుకేషన్ ఇప్పుడు కేవలం ఒక ఆప్షన్ కాదు, అత్యవసరం" అని అన్నారు. ఇంకా, "మన ఊపిరి ఆగే వరకు పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి" అని పిలుపునిచ్చారు. 2028లో COP33 భారత్‌లో జరగనున్నందున, రాబోయే మూడేళ్లు మనం సిద్ధం కావాలని చెప్పారు. ఈ అవార్డు తన ఒక్కరిదే కాదని, లోటస్ కుటుంబం అందరిదని పేర్కొన్నారు. ఈ అంతర్జాతీయ గుర్తింపుతో, గ్రీన్ ఎడ్యుకేషన్ రంగంలో భారతదేశం ప్రపంచానికి ఒక ఆదర్శంగా నిలిచిందని తెలిపారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
శుక్రవారం
26 సెప్టెంబర్
2025




## సకల జనుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య**



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: రాష్ట్రంలోని సకల జనుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పేర్కొన్నారు. యాదగిరిగుట్టలోని బీర్ల నిలయంలో ఆలేరు నియోజకవర్గానికి చెందిన 148 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..గత బీఆర్ఎస్ ప్రభుత్వ దుర్మార్గ పాలన కారణంగా.. ప్రభుత్వానికి ఆర్థికపరంగా ఎన్నో రకాల ఇబ్బందులు ఎదుర్కొంటుందన్నారు. అయినా సీఎం రేవంత్ ప్రత్యేక ప్రణాళికలతో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను సమపాళ్ళలో అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రజలకు దక్కాల్సిన ప్రభుత్వ ఫలాలు, సంపదను కల్వకుంట్ల కుటుంబ సభ్యులకు కేసీఆర్ దారి మరల్చారని ఆరోపించారు. అంతటితో ఆగకుండా అభివృద్ధి, సంక్షేమం పేరుతో కేసీఆర్ ఇష్టానుసారంగా అప్పులు చేసి.. ఆ నిధులను సైతం కేసీఆర్ తన కుటుంబానికి ధారాదత్తం చేశారని ధ్వజమెత్తారు. కేసీఆర్ కారణంగా ఆగమైన రాష్ట్రాన్ని పకడ్బందీ ప్రణాళికలతో సీఎం రేవంత్ రెడ్డి గాడిన పెడుతున్నారని పేర్కొన్నారు. ఇక పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వానికి సాధ్యంకాని కొత్త రేషన్ కార్డుల జారీ, ఉచిత సన్నబియ్యం పంపిణీని సీఎం రేవంత్ సుసాధ్యం చేసి చూపించారన్నారు. డబుల్ బెడ్రూం ఇండ్ల పేరుతో కేసీఆర్ పదేళ్లు కాలయాపన చేస్తే.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నరలోనే ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి పేదల సొంతింటి కలను సీఎం రేవంత్ నెరవేర్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం, జిల్లా నాయకుడు దుంబాల వెంకట్ రెడ్డి, పలు మండలాల కాంగ్రెస్ నాయకులు, సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులు తదితరులు ఉన్నారు.

## 'లలితాదేవి' అలంకారంలో పర్వతవర్ధినీదేవి

**నాలుగో రోజు వైభవంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు**



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్:యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో శ్రీదేవి నవరాత్రి ఉత్సవాలు నయనానందకరంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజైన గురువారం పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి (శివాలయం) ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాలుగో రోజు పర్వతవర్ధినీ అమ్మవారు 'లలితాదేవి' అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు అమ్మవారిని లలితాదేవిగా సర్వాంగ సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. నాలుగో రోజు పూజల్లో భాగంగా ఉదయం ప్రాతఃకాల పూజ, అర్చనలు, పారాయణాలు, శ్రీదేవి జపాలు, పర్వతవర్ధినీ దేవికి సహస్రనామార్చన నిర్వహించారు. ఇక సాయంత్రం ఆలయంలో నిత్య పూజలు ముగిసిన తర్వాత.. అమ్మవారికి నవావరణ పూజ, సహస్రనామార్చన, మంత్ర పుష్పాలు వంటి పూజా కైంకర్యాలు నిర్వహించి తీర్థప్రసాద వినియోగం గావించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈవోలు గజవెల్లి రఘు, శంకర్ నాయక్, ప్రధాన పురోహితుడు సత్యనారాయణ శర్మ, ప్రధానార్చకులు నర్సింహరాములు, సహాయ అర్చకులు తదితరులు ఉన్నారు.

## యాదగిరిగుట్ట దేవస్థానం ఇంఛార్జ్ ఈవోగా రవినాయక్ బాధ్యతలు

**గతంలో యాదాద్రి జిల్లా జాయింట్ కలెక్టర్ గా పని చేసిన రవినాయక్**



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఇంచార్జ్ ఈవోగా ఐఏఎస్ అధికారి రవినాయక్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం రవినాయక్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ మెంబర్ సెక్రటరీగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆలయ ఈవోగా ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించడంతో గురువారం ఆయన ఇంచార్జ్ ఈవోగా ఛార్జ్ తీసుకున్నారు. ప్రస్తుత ఆలయ ఈవో వెంకటరావు వ్యక్తిగత పనుల నిమిత్తం నెల రోజుల పాటు సెలవు పెట్టారు. కాగా గతంలో రవినాయక్ యాదాద్రి జిల్లా జాయింట్ కలెక్టర్ గా పని చేశారు. ఆలయ ఇంచార్జ్ ఈవోగా బాధ్యతలు స్వీకరించడానికి యాదగిరిగుట్టకు వచ్చిన రవినాయక్ కు తహశీల్దార్ గణేష్ నాయక్ ఫ్లవర్ బొకే ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం గర్భగుడిలో స్వయంభూ నారసింహుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శనం కల్పించారు. అనంతరం ఈవో క్యాంప్ కార్యాలయంలో అర్చకుల వేదాశీర్వచనం అనంతరం.. ఇంచార్జ్ ఈవోగా సంతకం చేసి బాధ్యతలు చేపట్టారు. తర్వాత పలు ఫైళ్లపై సంతకాలు చేసి విధులు షూరు చేశారు. ఈ సందర్భంగా ఐఏఎస్ రవినాయక్ మాట్లాడుతూ.. స్వామివారితో పాటు దర్శనానికి వచ్చే భక్తులకు సేవ చేసే అవకాశం రావడం సంతోషంగా ఉందన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కనీస మౌలిక సదుపాయాలు కల్పించే విషయంలో ప్రత్యేక చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

# యాదగిరిగుట్టలో 'గిరిప్రదక్షిణ'

**పాల్గొన్న మాజీ మంత్రి హరీష్‌రావు ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యేలు సునీత, బిక్షమయ్య గౌడ్, డీసీసీబీ మాజీ చైర్మన్ మహేందర్ రెడ్డి**



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రం సందర్భంగా.. గురువారం సిద్ధిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు 'గిరిప్రదక్షిణ'లో పాల్గొన్నారు. అనంతరం గర్భగుడిలో స్వయంభూ నారసింహుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గిరిప్రదక్షిణలో పాల్గొనడానికి బుధవారం రాత్రి యాదగిరిగుట్టకు వచ్చిన హరీష్ రావు.. పట్టణంలోని ప్రెసిడెన్షియల్ సూట్ లో నిద్ర చేశారు. అనంతరం గురువారం ఉదయం 5:30 గంటలకు వైకుంఠ ద్వారం వద్ద స్వామివారి పాదాలకు పూజలు చేసి గిరిప్రదక్షిణ ఆరంభించారు. ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, ఆలేరు మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీత, బూడిద బిక్షమయ్య గౌడ్, డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డితో కలిసి కొండ చుట్టూ రెండున్నర కిలోమీటర్ల పాటు కాలినడకన ప్రదక్షిణలు చేశారు. అనంతరం కొండపైకి వెళ్లి గర్భగుడిలో స్వయంభూ నారసింహుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన ఆయనకు ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనం అనంతరం ఆశీర్వచన మండపంలో అర్చకులు ఆయనకు వేదాశీర్వచనం చేయగా.. ఆలయ ఏఈవో గజవెల్లి రఘు, సూపరింటెండెంట్ రాజన్ బాబు లడ్డూప్రసాదం, స్వామివారి శేషవస్త్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య, ఆలేరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రవీందర్ గౌడ్, పలువురు బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.





## కొండపైకి ఆటోలను అనుమతించడంలో కాంగ్రెస్ బండారం బయటపడింది

**ప్రభుత్వ మాజీ విప్**
**గొంగిడి సునీతా మహేందర్ రెడ్డి**



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్టలో లక్ష్మీనరసింహస్వామి కొలువై ఉన్న కొండపైకి ఆటోలను అనుమతించడంలో కాంగ్రెస్ ప్రభుత్వ బండారం బయటపడిందని ప్రభుత్వ మాజీ విప్, ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతా మహేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఆలయానికి బకాయి పడ్డ రూ.31.42 లక్షలు వెంటనే చెల్లిస్తేనే కొండపైకి ఆటోలను అనుమతిస్తామని ఆటో యూనియన్ కు దేవస్థానం ఇటీవల ఇచ్చిన నోటీసులతో కాంగ్రెస్ ప్రభుత్వం అసలు గుట్టు బట్టబయలైందన్నారు. యాదగిరిగుట్టలోని బీఆర్ఎస్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఆటోలను ఉచితంగా కొండపైకి అనుమతిస్తామని కేటీఆర్ స్పష్టమైన హామీ ఇచ్చారని.. కానీ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం నెలకు రూ.4.30 లక్షలు దేవస్థానానికి చెల్లించేలా ఆటో యూనియన్ తో ఒప్పందం చేసుకుని కొండపైకి ఆటోలను అనుమతించారని తెలిపారు. ఆలయానికి ఆటో యూనియన్ బకాయి పడ్డ రూ.31.42 లక్షలు చెల్లించకపోతే ఆటోలను కొండపైకి అనుమతించబోమని ఆటో యూనియన్ కు దేవస్థానం నోటీసులు ఇవ్వడంతో అసలు విషయం బహిర్గతం అయిందన్నారు. ఆటో యూనియన్ బకాయి పడ్డదాంట్లో ఒక్క పైసా కూడా దేవస్థానానికి చెల్లించబోదని, బకాయిలు మాఫీ చేసి కొండపైకి ఆటోలను ఉచితంగా అనుమతించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో ఆటో కార్మికులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఆటో యూనియన్ బాకీ పడ్డ అమౌంట్ ను ప్రభుత్వం కడుతుందో, స్థానిక ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య చెల్లిస్తారో తేల్చుకోవాలని, అంతేతప్ప ఆటో యూనియన్ చెల్లించే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులను కొండపైకి చేరవేస్తూ సేవ చేస్తున్న ఆటో డ్రైవర్లపై ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఆలోచించి బకాయిలు మాఫీ చేయాలని కోరారు. లేనియెడల ఆటోలను కొండపైకి ఉచితంగా అనుమతించే వరకు ఆటో డ్రైవర్ల తరఫున బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని, ఆటో కార్మికులు అధైర్య పడొద్దని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య, ఆలేరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రవీందర్ గౌడ్, బీఆర్ఎస్ మండల సెక్రటరీ జనరల్ శ్రీనివాస్ గౌడ్, మాజీ సర్పంచ్ బీరయ్య, ఆలేరు మున్సిపల్ మాజీ చైర్మన్ శంకరయ్య, పలు మండలాల బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

# మైనర్లకు గదులిస్తే కఠిన చర్యలు తప్పవు

**యాదగిరిగుట్ట డివిజన్**
**ఏసీపీ శ్రీనివాస్ నాయుడు**




యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: లక్ష్మీనరసింహస్వామి దర్శనం పేరుతో యాదగిరిగుట్టకు వచ్చే మైనర్లకు గదులు అద్దెకిచ్చి ఆశ్రయం కల్పిస్తే సంబంధిత లాడ్జీ ఓనర్లు, నిర్వాహకులపై కఠిన చర్యలు తప్పవని యాదగిరిగుట్ట డివిజన్ ఏసీపీ శ్రీనివాస్ నాయుడు హెచ్చరించారు. గురువారం యాదగిరిగుట్టలోని ఏసీపీ కార్యాలయంలో సీఐ భాస్కర్ తో కలిసి నిర్వహించిన ప్రెస్ మీట్ లో ఆయన మాట్లాడారు. డబ్బులకు కక్కుర్తి పడి ఎలాంటి ఐడీ ప్రూఫ్ లేకున్నా, మైనర్లకు రూంలు ఇచ్చినా సంబంధిత లాడ్జీలను సీజ్ చేసి నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. తెలంగాణ తిరుమలగా విరాజిల్లుతున్న యాదగిరిగుట్ట ఆలయ పవిత్రత కాపాడడమే తమ ధ్యేయమన్న ఆయన.. ఇందుకోసం ఎంతటి కఠిన చర్యలకైనా వెనుకాడబోమని హెచ్చరించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారినైనా, వారి వెనకాల ఏ స్థాయి వ్యక్తులున్నా ఉపేక్షించే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. అద్దె గదుల కోసం మేజర్లు వచ్చినా సరే ఆధార్ కార్డ్ వంటి ఐడీ ప్రూఫ్ లేనిదే రూంలు ఇవ్వొద్దని, మైనర్లకు గదులు అసలే ఇవ్వొద్దని లాడ్జీల ఎదుట పోస్టర్లు వేశామని, లాడ్జీ ఓనర్లకు నోటీసులు కూడా ఇచ్చామని తెలిపారు.

**మైనర్లకు గదులిచ్చిన సోమేష్ లాడ్జ్ నిర్వాహకుడిపై పోక్సో కేసు**

ఈ నెల 21న హైదరాబాద్ అల్వాల్ కు చెందిన ముగ్గురు మైనర్ బాలికలను ముగ్గురు అబ్బాయిలు దర్శనం పేరుతో యాదగిరిగుట్టకు తీసుకువచ్చి.. సోమేష్ లాడ్జ్ లో రూంలు తీసుకుని మైనర్ బాలికలపై అఘాయిత్యానికి పాల్పడ్డారు. బాలికలు కనిపించడం లేదని అల్వాల్ పోలీస్ స్టేషన్ లో మిస్సింగ్ కేసు ఫైల్ కాగా.. మైనర్ బాలికలను యాదగిరిగుట్టకు తీసుకొచ్చిన అఘాయిత్యానికి పాల్పడ్డ ముగ్గురు అబ్బాయిలను గుర్తించి అల్వాల్ పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి జ్యుడీషియల్ రిమాండ్ తరలించారని వెల్లడించారు. ఇక యాదగిరిగుట్టలో మైనర్లకు గదులు అద్దెకిచ్చి ఇట్టి ఘటనకు కారణమైన సోమేష్ లాడ్జ్ ఓనర్ పై యాదగిరిగుట్ట పీఎస్ లో పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్ పంపామని తెలిపారు. అలాగే మైనర్లు గదులను అద్దెకు తీసుకున్న సోమేష్ లాడ్జ్ ను సీజ్ చేశామని తెలిపారు. యాదగిరిగుట్టలో అసాంఘిక కార్యకలాపాల నియంత్రణ అందరి బాధ్యత అని, ఇందుకోసం అన్ని వర్గాల ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట టౌన్ సీఐ భాస్కర్ తదితరులు ఉన్నారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక

శుక్రవారం
26 సెప్టెంబర్
2025





# దేశాభివృద్ధికి జాతీయ రహదారుల పాత్ర కీలకం

- రూ.30 వేల కోట్లతో రోడ్ల నిర్మాణానికి కేంద్రం ఆమోదం
- రాష్ట్రంలో రూ. 550 కోట్లతో నూతన రహదారుల నిర్మాణం
- రూ.860 కోట్లతో 422 కి.మి. రోడ్లను రాష్ట్రానికి మంజూరు
- కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో రహదారులపై చర్చ
- మీడియా సమావేశంలో వెల్లడించిన కిషన్ రెడ్డి
- కాంగ్రెస్, బిఆర్ఎస్‌లకు బిజెపి ఫోబియా పట్టుకుందని విమర్శలు



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 25:** దేశాభివృద్ధికి జాతీయ రహదారుల పాత్ర చాలా కీలకమని బిజెపి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. మారుమూల ప్రాంతాల్లో కూడా అభివృద్ధికి సరైన అడుగులు పడుతున్నాయని అన్నారు. ఈ సందర్భంగా ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ..వివిధ రాష్ట్రాలతో తెలంగాణకు జాతీయ రహదారులు అనుసంధానం అయ్యాయని, జాతీయ రహదారుల నిర్వహణ వల్ల దేశ వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలు తగ్గాయని తెలియజేశారు. కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో సమావేశమై తెలంగాణ రహదారులపై చర్చించానని, రాష్ట్రంలో రూ. 550 కోట్లతో నూతన రహదారులకు నిర్మాణం చేపట్టాం అని పేర్కొన్నారు. రూ.860 కోట్లతో 422 కి.మి. రోడ్లను రాష్ట్రానికి మంజూరు చేశామని, రూ.30 వేల కోట్లకు పైగా నూతన జాతీయ రహదారుల నిర్మాణానికి కేంద్రం ఆమోదం తెలిపిందని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధిగా.. తెలంగాణ రాష్ట్రానికి నిధులు, ప్రాజెక్టులు రావాలని, ప్రజలకు మేలు జరగాలని కోరుకునే వ్యక్తుల్లో ముందువరసలో నేనుంటాను.. మా మంత్రిత్వ శాఖలో.. తెలంగాణ ప్రాజెక్టుల కోసం స్పెషల్ సెల్ ఏర్పాటు చేసుకుని.. అన్నిరకాల అభివృద్ధి పనులను మానిటర్ చేస్తున్నాను.. మా పార్టీ తెలంగాణ అభివృద్ధికి చిత్త శుద్ధితో పనిచేస్తుంది.. రీజనల్ రింగ్ రోడ్డు, హైదరాబాద్ మెట్రో విషయంలో.. అందరికంటే ముందే మేం ప్రొయాక్టివ్ గా వ్యవహరించామని తెలిపారు. ట్రిపుల్ ఆర్ కు ముందుగానే కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపింది.. మెట్రో విషయంలో.. రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన చేయాలి.. ఆర్థిక సంస్థలు రుణాలు ఇస్తున్నప్పుడు.. చాలా విషయాలపై స్పష్టత కావాలని అడుగుతారు.. మెట్రో విషయంలో కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రిని కలిసినపుడు.. వారు చాలా స్పష్టంగా చెప్పారు.. ఇప్పుడు మెట్రో రైల్ నిర్వహిస్తున్న ఎల్ అండ్ టి కొత్తగా నిర్మాణం చేపట్టనున్న కంపెనీ మధ్య ఏమైనా ఒప్పందం జరిగిందా అని ప్రశ్నించారు.. కాళేశ్వరం పై సీబీఐ ప్రతిపాదనలు అందాయని పరిశీలనలో ఉందని తెలిపారు. బీఆర్ఎస్ కాంగ్రెస్ పార్టీలకు బీజేపీ ఫోబియా పట్టుకుంది... రెండు పార్టీలు అర్థం పర్థం లేకుండా, ఆధారాల్లేకుండా.. మాట్లాడుతున్నారు. మీరు మాకు నీతులు చెప్పాల్సిన అవసరం లేదు. బీసీ రిజర్వేషన్ పెరగాలని అసెంబ్లీలో మద్దతిచ్చాం.. ఇది కేంద్ర ప్రభుత్వం పరిధిలోని అంశం కాదు. కాంగ్రెస్ పార్టీ తమ మేనిఫెస్టోలో పేర్కొన్నట్లుగా.. 42శాతం బిసి రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. ఇదే సందర్భంలో సీఎం రేవంత్ రెడ్డిపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. బీజేపీపై ప్రతి ఒక్కరూ ఆరోపణలు చేసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్, బి ఆర్ ఎస్ పార్టీల నేతలు విచిత్రమైన మానసిక వ్యాధితో బాధపడుతున్నారని అన్నారు. వాళ్లకు బిజెపి ఫోబియా పట్టుకుందన్నారు. చిల్లర మాటలు, అవగాహన లేకుండా, ఆధారాలు లేకుండా మాట్లాడుతున్నారని తెలిపారు. బిజెపికి తెలంగాణలో ఎవరితో కలవాల్సిన అవసరం లేదన్నారు. కెసిఆర్, కేటీఆర్, బిఆర్ఎస్, కాంగ్రెస్‌లతో బిజెపి ఎప్పుడు కలవదని స్పష్టం చేశారు. కలిసి కాపురాలు చేసింది మీరు.. ఎన్నికల్లో పొత్తులు పెట్టుకుంది మీరు.. మంత్రి పదవులు పంచుకుంది మీరు.. బిజెపికి ఎటువంటి అవసరం లేదని ఫైర్ అయ్యారు. తెలంగాణలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా స్వతంత్రంగా పోటీ- చేస్తాం.. టిఆర్ఎస్, కాంగ్రెస్లకు ప్రత్యామ్నాయంగా అధికారంలోకి వచ్చేందుకే మా ప్రయత్నం చేస్తామని కిషన్ రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి వ్యవహారశైలి సమంజసంగా లేదు. జెన్ జీ విషయంలో కేటీఆర్ వ్యాఖ్యలు దేశద్రోహ వ్యాఖ్యలు.. నేపాల్ లో జరిగినట్లుగా.. పీఎం ఇంటిపైనా, మంత్రుల ఇంటిపైనా.. న్యాయస్థానాలపైనా దాడులు జరిగినట్లుగా.. ఇక్కడ జరగాలని కేటీఆర్ భావిస్తున్నారా? బాబా సాహెబ్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం ఇక్కడ అమలవుతోంది.. దేశంలో సమర్థవంతమైన నాయకత్వం ఉంది. అభివృద్ధి వేగవంతంగా సాగుతోంది. ప్రపంచ దేశాలతో పోలిస్తే.. మనం వేగంగా పురోగతి సాధిస్తున్నాం. ఇలాంటి పరిస్థితుల్లో.. కొందరు దివాళాకోరు మాటలు మాట్లాడం సరికాదు. ప్రజలు ఇలాంటి వ్యాఖ్యలను ఖండించాలని సంచలన వ్యాఖ్యలు చేశారు.

# ఏ ఒక్కరూ సంతోషంగా లేరు

## అంగన్‌వాడీ పట్ల కర్కశంగా ఉండటం కరెక్టు కాదు : హరీశ్‌రావు



**హైదరాబాద్, సెప్టెంబర్ 25:** అనేక అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ పార్టీ అందరినీ నట్టేట ముంచుతుందని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతున్న అంగన్‌వాడీ టీచర్లపై రేవంత్ ప్రభుత్వం కర్కశంగా వ్యవహరిస్తుండటం పట్ల ధ్వజమెత్తారు. తమ సమస్యల పరిష్కారం కోసం ఛలో సెక్రెటేరియట్ పిలుపునిచ్చిన అంగన్‌వాడీల పట్ల ప్రభుత్వం పోలీసులను ప్రయోగించి, కర్కషంగా వ్యవహరించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం అని ఆయన పేర్కొన్నారు. మహిళలను కోటీశ్వరులుగా చేస్తామంటూ బీరాలు పలికిన రేవంత్ రెడ్డి, రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడిక్కడ అరెస్టులు చేసి పోలీసు స్టేషన్లకు తరలించడం సిగ్గుచేటు. ఇందిరమ్మ రాజ్యంలో మహిళా ఉద్యోగులకు గౌరవం లేదా? గుర్తింపు లేదా? ప్రజా పాలన అని రాక్షస పాలన కొనసాగిస్తారా? ఆడబిడ్డలకు బతుకమ్మ పండుగ సంబురం లేకుండా చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వారి ఉసురు తగులుతుంది అని దుయ్యబట్టారు. అంగన్‌వాడీల సేవలను గుర్తించిన కేసీఆర్ వారు వర్కర్లు కాదని, అంగన్‌వాడీ టీచర్లు అని పోస్టును ఉన్నతీకరించారు. వారి గౌరవాన్ని పెంచారు. 2014 నాటికి అంగన్‌వాడీ టీచర్లకు కేవలం రూ.4,200, వారి సహాయకులకు రూ.2,200 వేతనం లభించేది. కానీ బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక అంగన్‌వాడీ టీచర్ల వేతనాన్ని రూ.13,650లకు, మినీ అంగన్ వాడీ టీచర్ల వేతనాన్ని రూ.7,800లకు, అంగన్ వాడీ హెల్పర్ల వేతనాన్ని రూ.7,800 లకు పెంచి దేశంలోనే అత్యధికంగా చెల్లించారు అని హరీశ్‌రావు గుర్తు చేశారు. అభయహస్తం పేరిట ఇచ్చిన ఎన్నికల మేనిఫెస్టోలో అంగన్‌వాడీ టీచర్ల వేతనాన్ని 18,000లకు పెంచుతామని, ఈపీఎఫ్ పరిధిలోకి తీసుకువచ్చి ఉద్యోగ భద్రత కల్పిస్తామని ప్రకటించారు. మాయ మాటలు చెప్పి, 22 నెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీకి అతీ లేదు, గతీ లేదు. మహాలక్ష్మి పేరిట మీరు అమలు చేస్తున్న ఉచిత బస్సుల్లోనే జిల్లాల నుంచి సచివాలయం వద్దకు వచ్చి మిమ్మల్ని నిలదీస్తున్నారు. మీ మోసపూరిత వైఖరి పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అరెస్టులు చేసిన అంగన్ వాడీలను వెంటనే విడుదల చేయాలని, ఎన్నికల మేనిఫెస్టోలో వారికి ఇచ్చిన హామీలు నెరవేర్చాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నాం అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

# బీఆర్ఎస్‌కు నూకలు చెల్లాయి

- వాటాల తేడాలు రావడంతోనే కేసీఆర్ కుటుంబంలో కల్లోలం
- ఆ పార్టీని నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరు : మహేశ్‌కుమార్‌గౌడ్

**న్యూఢిల్లీ, సెప్టెంబర్25 :** బీఆర్ఎస్ పార్టీకి రాష్ట్రంలో నూకలు చెల్లాయని, ఆ పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ విమర్శించారు. వచ్చే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక మెజార్టీతో గెలవడం తథ్యమని ఆశాభావం వ్యక్తంచేశారు. కోట్లాడి తెచ్చుకున్న తెలంగాణను వంతులవారీగా పంచుకున్నారని.. ఇప్పుడు వాటాల దగ్గర తేడా రావడంతో కొట్టుకుంటున్నారని ఎద్దేవా చేశారు. జూబ్లీహిల్స్‌లో ఒక్క సామాజికవర్గానికే కాకుండా అందరికీ సంక్షేమం, అభివృద్ధి అమలు చేస్తున్నామని తెలిపారు. జూబ్లీహిల్స్ ఎన్నికపై సర్వేలు చేస్తున్నామని.. సర్వేలో ఎవరూ ముందుంటే వారికే సీటు ఇస్తామని క్లారిటీ ఇచ్చారు. జూబ్లీహిల్స్ ఎన్నికలో గెలిచే వారికి సీటు ఇస్తామని స్పష్టం చేశారు. ఏడాది కాంగ్రెస్ పాలనలో తెలంగాణ రాష్ట్రాన్ని ఎంతగానో అభివృద్ధి చేశామని చెప్పుకొచ్చారు. గురువారం ఢిల్లీలో మీడియాతో చిట్‌చాట్ చేశారు మహేష్ కుమార్ గౌడ్. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో చాలామంది రేసులో ఉన్నారని చెప్పుకొచ్చారు. సీఎన్ రెడ్డి, బాబా ఫసియుద్దీన్, నవీన్ యాదవ్ , బొంతు రామ్మోహన్‌లతో సహ పలువురు జూబ్లీహిల్స్ టికెట్ అడుగుతున్నారని గుర్తుచేశారు. స్థానికులకు జూబ్లీహిల్స్ టికెట్ ఇవ్వాలనే డిమాండ్ ఉందని తెలిపారు. మంత్రుల కమిటీ, సర్వే ఫలితాల ఆధారంగా నిర్ణయాలు ఉంటాయని పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ కూడా కాంగ్రెస్ ఖాతాలోకే వస్తోందని చెప్పుకొచ్చారు. గతంలో కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచిందని గుర్తుచేశారు. గాంధీ భవన్‌లో మంత్రుల ముఖాముఖి కార్యక్రమం చాలా బాగా జరుగుతోందని చెప్పుకొచ్చారు. గురువారం మధ్యాహ్నం మూడు గంటలకు ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ అధ్యక్షతన తెలంగాణ డీసీసీల అంశంపై సమావేశం నిర్వహిస్తామని వెల్లడించారు. రాహుల్ గాంధీ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ఏఐసీసీ కొత్తగా ఎంపిక చేసిన 22 మంది అబ్జర్వర్లు హాజరవుతారని తెలిపారు. అక్టోబర్ 4వ తేదీన 22 మంది అబ్జర్వర్లు తెలంగాణలో పర్యటిస్తారని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. హైడ్రాతో సామాన్యుడికి ఇబ్బంది లేదు. కబ్జా చేసిన వారికే హైడ్రాతో ఇబ్బందులు. ప్రభుత్వ భూమి పోకుండా ఉండేలా హైడ్రా పని చేస్తుంది. సీఎం రేవంత్ రెడ్డి అన్న తిరుపతి రెడ్డి ఇల్లు హైడ్రా కూలగొట్టడానికి వెళ్లింది, కానీ కోర్టు ఆర్డర్ స్థానికులు తీసుకొచ్చారు ఆగిపోయింది. తన, మన భేదం లేకుండా హైడ్రా పని చేస్తోంది. పీసీసీ పాదయాత్ర సీఎం రేవంత్ రెడ్డికి, ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌కి తెలియకుండా చేశారని కొందరు గతంలో ఆరోపణలు చేశారు. బీఆర్ఎస్ పార్టీ నాలుగు ముక్కలు అయింది. బీఆర్ఎస్ మళ్లీ పునర్జీవం పోసుకోదు. ఏం చూసి బీఆర్ఎస్‌ను ప్రజలు ఆదరిస్తారు.



కేసీఆర్ ఫామ్ హౌస్‌కే పరిమితం అయ్యారు. బీసీ రిజర్వేషన్లపై చిత్తశుద్ధి బీజేపీ నాయకులకు ఉంటే ఒక్కరోజులో బీసీ బిల్లుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపొచ్చు ' అని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో జరిగిన అవినీతి అన్నిటిపైన సీబీఐ విచారణ జరిపితే బాగుంటుంది. కవితది ఆస్తుల పంచాయితీ. కాంగ్రెస్‌తో కవితకు ఏలాంటి సంబంధం లేదు. కవితకు ప్రజల్లో ఏం ఇమేజ్ ఉంది ?. దోపిడీ చేసిన వారిని ప్రజలు ఎందుకు ఆదరిస్తారు. ఫోన్ ట్యాపింగ్ పెద్ద కేసు, అందరి వాయిస్‌లు రికార్డు చేశారు. నాది, రేవంత్‌రెడ్డిది రెండున్నరేళ్ల నుంచి గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్ చేసింది. నేను వాడిన జియో సిమ్ కార్డు నెంబర్ జియోసంస్థకు గత కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చింది. జియో సంస్థకు రాసిన లేఖ కూడా దొరికింది. ఫోన్ ట్యాపింగ్ చేసి కేసీఆర్, కేటీఆర్ వ్యూహ రచన చేసి గత ఎన్నికల్లో గెలిచారు. ఫార్ములా ఈ కారు రేసు కేసులో కేటీఆర్ అరెస్ట్ తప్పదు.. క్లియర్ ఆధారాలు ఉన్నాయి' అని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.




# నేటి నుంచే మద్యం టెండర్లు

**లిక్కర్ షాపులకు దరఖాస్తులు ● ఒక్కో అప్లికేషన్‌కు రూ.3లక్షల రుసుం**

**అక్టోబర్18 వరకు అవకాశం ● మార్గదర్శకాలు జారీ చేసిన ఎక్సైజ్ శాఖ**

**హైదరాబాద్, సెప్టెంబర్ 25:** మద్యం దుకాణాల కేటాయింపు, షెడ్యూల్‌కు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 2,620 మద్యం దుకాణాలకు శుక్రవారం నుంచి అక్టోబర్ 18వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు మార్గదర్శకాల్లో ప్రభుత్వం పేర్కొంది. ఇక అక్టోబర్ 23వ తేదీన లాటరీ పద్ధతిలో దుకాణాలను కేటాయించనున్నారు. 2025 డిసెంబర్ 1 నుంచి 2027 నవంబర్ 30వ తేదీ వరకు అంటే రెండేళ్ల కాలానికి అనుమతులతో ఎక్సైజ్ శాఖ కొత్త లైసెన్సులు జారీ చేయనుంది. కొత్త మద్యం దుకాణాలకు దరఖాస్తు రుసుం రూ. 3 లక్షలుగా నిర్ధారించారు. ఎక్సైజ్ చట్టం 1968 ప్రకారం శిక్ష పడిన వారు, ప్రభుత్వానికి బకాయిలు పడి సక్రమంగా చెల్లింపులు చేయని వారు దుకాణాలు పొందేందుకు అనర్హులు. ఇక మద్యం దుకాణాల కేటాయింపుల్లో గౌడ సామాజిక వర్గానికి 15 శాతం, ఎస్సీలకు 10, ఎస్టీలకు 5 శాతం రిజర్వేషన్లు కల్పించనున్నారు. ఈ నేపథ్యంలో రిజర్వేషన్ దరఖాస్తుదారులకు కుల ధ్రువీకరణ పత్రాన్ని తప్పనిసరి చేశారు అధికారులు.

# స్వదేశీ వస్త్రాలనే వాడండి : ఎంపీ లక్ష్మణ్



**హైదరాబాద్, సెప్టెంబర్ 25:** దేశం అన్ని రంగాల్లో మరింతగా రాణించాలంటే స్వదేశీ వస్త్రాలనే ఉపయోగించాలని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ కోరారు. దిన్ దయాళ్ ఉపాధ్యయ జయంతి సందర్భంగా లక్ష్మణ్ నివాళులర్పించారు. గురువారం ఎంపీ మీడియాతో మాట్లాడుతూ.. దిన్ దయాళ్ ఉపాధ్యాయ ఇచ్చిన సందేశాన్ని మోదీ సాకారం చేస్తున్నారని తెలిపారు. ప్రధాని జన్ ధన్ ఖాతాలు తెరిపించి బ్యాంకులకు చేరువ చేశారని.. దిక్కు లేని వారికి మోదీ దిక్కయ్యారని చెప్పుకొచ్చారు. 4 కోట్ల మందికి ఆవాసం నిర్మించారన్నారు. మరుగుదొడ్లు నిర్మించడంతో పాటు.. అనేక కార్యక్రమాలు తీసుకువచ్చారని ఎంపీ పేర్కొన్నారు. ఇతర దేశాలపై ఆధారపడకూడదని స్వదేశీ వస్తువులను ఉపయోగించాలని పిలుపు ఇచ్చారన్నారు. అక్టోబర్ 2న చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి.. చేనేత వస్త్రాలు ధరించాలని పిలుపునిచ్చారు. ప్రపంచంలో భారతదేశాన్ని అభివృద్ధిలో 4వ స్థానానికి మోదీ తీసుకువచ్చారని అన్నారు. పేద మధ్యతరగతి ప్రజలు ఎక్కువగా కొనుగోలు చేసే వస్తువులపై జీఎస్టీ తగ్గించారని.. గొప్ప సంస్కరణ తీసుకువచ్చారని కొనియాడారు. అమెరికా లాంటి దేశాలు టారిఫ్ పేరిట ఇబ్బందులు పెడుతున్నా.. దేశంలో అనేక స్టార్టప్ సంస్థలు తీసుకువస్తున్నారని అన్నారు. సేవ పక్వడలో ప్రజలందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. 2047 వరకు దేశం అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలంటే స్వదేశీ వస్త్రాలు ఉపయోగించాలని ఎంపీ లక్ష్మణ్ పేర్కొన్నారు.

# స్థానిక ఎన్నికలపై బిఆర్ఎస్ అప్రమత్తం

**నేతలను అలర్ట్ చేసిన వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్**

**ముఖ్యనేతలతో కేటీఆర్, హరీష్ రావుల టెలి కాన్ఫరెన్స్**

**హైదరాబాద్, సెప్టెంబర్ 25:** స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడైనా జరిగే అవకాశం ఉందన్న సమాచారంతో బిఆర్ఎస్ అప్రమత్తం అయ్యింది. పార్టీ శ్రేణులను,కార్యకర్తలను అలర్ట్ చేసింది. ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సూచించారు. పార్టీ నేతలతో కేటీఆర్, హరీశ్‌రావు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. క్షేత్రస్థాయిలో సన్నాహక సమావేశాలు ఏర్పాటు- చేయాలని నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లను ఆదేశించారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండాలని నేతలకు దిశానిర్దేశం చేశారు. అందరితో మమేకమై ఉండే గెలుపు గుర్రాలకు పోటీకి అవకాశం కల్పించేలా చూడాలని సూచించారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని.. ప్రజలు భారత రాష్ట్ర సమితి, కేసీఆర్ వైపు ఎదురు చూస్తున్నారన్నారు. హామీలు అమలు చేయకపోవడం, ప్రభుత్వ వైఫల్యాలు, స్థానిక సమస్యల్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. పల్లె ప్రగతి పేరిట గ్రామీణ ప్రాంతాల్లో భారత రాష్ట్ర సమితి హయాంలో చేసిన కార్యక్రమాలు, వాటి ఫలితాలు.. ఇప్పుడు పల్లెల్లో పరిస్థితిని కూడా ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని వివరించారు. బతుకమ్మ పండుగకు కూడా రాష్ట్ర ప్రభుత్వం సరైన ఏర్పాట్లు- చేయలేదని, తెలంగాణ సంస్కృతి పట్ల కాంగ్రెస్ నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని కేటీఆర్ ఆరోపించారు. స్థానికంగా భారత రాష్ట్ర సమితి నేతల ద్వారా బతుకమ్మ కోసం ఏర్పాట్లు- చేసేలా చూడాలని సూచించారు. అదే సందర్భంలో ప్రజలతో నిత్యం సంబంధాలు నెరుపుతూ ముందుడాలని అన్నారు.

# ఆగివున్న లారీని ఢీకొన్న ప్రైవేట్ బస్సు

**నిజామాబాద్,సెప్టెంబర్25 :** నిజామాబాద్ జిల్లా డిచ్ పల్లి మండలం సుద్దపల్లి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. 44 వ జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. లారీని ఢీకొట్టిన తర్వాత డివైడర్ పైకి ట్రావెల్స్ బస్సు దూసుకెళ్లింది. ఈ సకనమాదం పది మంది గాయడడంతో ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం జరిగినప్పుడు బస్సులో 20 మంది ప్రయాణికులు ఉన్నారు. నిజామాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు యూ-టర్న్ తీసుకుంటుండగా ఈ ప్రమాదం జరిగింది. స్థానికులు సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
శుక్రవారం
26 సెప్టెంబర్
2025







# అమెరికా ఆంక్షలకు అనుగుణంగా సాగాలి

అమెరికా అధ్యక్షుడు ట్రంపు లేపుతున్న కంపు కారణంగా ప్రపంచ దేశాలు అనేక ఇబ్బందుల్లో పడుతున్నాయి. ప్రధానంగా భారతదేశ యువత పరిస్థితి డోలాయమానంలో పడింది. ఎంఎస్, ఎంబిఎ చదువులు అక్కడే చదివి ఉద్యోగాలు పొందాలన్న వారి కలలపై ట్రంప్ నీళ్లు చల్లారు. ఇటీవల హెచ్-1 బి వీసాలను వ్యాపారంగా మార్చడంతో ఇప్పుడు అమెరికా వెళ్ళి ఇక చదువుకోవడం కష్టంగా మారింది. ఇకపోతే అమెరికాలో ఉన్నత చదువులు చదివిన భారతీయలు ఉద్యోగాలు లేక అక్కడ మగ్గుతున్నారు. మన దేశంలో ఉద్యోగాలు దక్కక ఎంతోమంది విదేశాలకు వెళ్లినా వారికి భరోసా దక్కడం లేదు. అటు ఉద్యోగాలు దొరక్క..బ్యాంకు రుణాలు కట్టలేక నానా అవస్థలు పడుతున్నారు. పోనీ దేశానికి వచ్చి ఇక్కడేమైనా చేద్దామా అంటే ఇక్కడా పరిస్థితి దారుణంగా ఉంది. దేశంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కనిపించడం లేదు. ఉన్న ఉద్యోగులను మెల్లగా తీసేస్తున్నారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల ఫలితంగా నిరుద్యోగం పెరుగుతున్నది. అలాగే ప్రైవేట్ పెట్టుబడులు తగ్గుతున్నవి. ప్రభుత్వ ఉద్యోగాలకోసం యువత ఎదురుచూడటం ఈ మధ్యకాలంలో ఎక్కువవుతున్నది. ఇలాంటి తక్షణ, అత్యవసర సమస్యల పరిష్కారం పట్ల దృష్టిసారించాల్సిందిపోయి నిర్లిప్తంగా ఉంటున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఓటు బ్యాంక్ పథకాలతో రాటుదేలాయి. విద్యా,ఉపాధి రంగాలను ప్రోత్సహించడం లేదు. విదేశాలపై ఆధారపడి వద్దంటున్న ప్రధాని మోడీ ఇక్కడ ఉపాధి, ఉద్యోగ రంగాలను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తామన్న భరోసా ఇవ్వడం లేదు. రాజకీయ పార్టీలు ప్రజా సంక్షేమం, అభివృద్ధి కేంద్రంగా పాలన సాగించడం లేదు. ఈ క్రమంలో ముందు ఆర్థిక వ్యవస్థ బలపడాలి. తరవాత స్వయం ఉపాధి పథకాలు భారీగా చేపట్టాలి. కానీ కేంద్ర ప్రభుత్వం ఈ దిశంగా చర్యలు తీసుకోవడం లేదు. ఆర్థిక మందగమనంపై దిద్దుబాటు చర్యలు తీసుకోవడం లేదు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే కొనసాగుతున్నా ముందే చర్యలు తీసుకుని ఉంటే కొంతయినా పరిస్థితి మెరుగు పడేది. నిజానికి మనది మిశ్రమ ఆర్థిక వ్యవస్థ. గ్రామీణ ఆర్థికరంగం బలోపేతం కావాలి. కానీ అలా జరగడం లేదు. అమెరికా లాంటి దేశాలు ఆంక్షలు విధిస్తే అతలాకుతలం కావడం మినహా గత్యంతరం లేని దుర్భర పరిస్థితుల్లో ఉన్నాం. ఇప్పుడు యువత మిగతా దేశాల వైపు చూస్తోంది. ఈ క్రమంలో కేంద్రం కఠిన నిర్ణయాలతో ముందుకు రావాల్సి ఉంది. ఇకపోతే రాష్ట్రాల్లో కులవృత్తులకు ప్రోత్సాహం దక్కడంలేదు. వ్యవసాయం, దాని అనుబంధ రంగాలను బలోపేతం చేసే చర్యలు తీసుకోవడం లేదు. నిరుద్యోగులను గట్టెక్కించే చర్యలకు బదులు, పన్నుల వసూళ్లపైనే దృష్టి సారిస్తున్నారు. దీంతో ఉద్యోగ,ఉపాధి రంగాలు తీవ్రంగా ప్రభావం చూపుతున్నాయి. డాలర్ బలపడుతుందే తప్ప రూపాయి బలపడడం లేదు. రోజురోజుకూ రూపాయి మరింత బలహీనం అవుతోంది. దీనిని పట్టించుకోక పోవడం వల్ల మాంద్యం దుస్థితి ఏర్పడిందనే చెప్పాలి. కారణాలను ఎవరో ఒకరిమీద నెట్టి తప్పించుకోవడం కన్నా దూరదృష్టితో సాగివుంటే ఇలాంటి దుస్థితి వచ్చేది కాదు. అమెరికా పెడుతున్న ఇబ్బందులు, సుంకాల నేపథ్యంలో డాలర్‌తో మారక విలువను ఆధీనంలోకి తెచ్చుకోక పోతే మరిన్ని కష్టాలు తప్పవు. అలాగే ఎగుమతులకు ప్రాధాన్యం పెరగాలి. అనవసర దిగుమతులకు కళ్లెం వేయాలి. లేకుంటే విదేశీ మారక నిల్వలపై తీవ్రప్రభావం చూపనుంది. దీంతో రూపాయి మరింత బలహీన పడనుంది. ఈ దశలో ఆర్థిక మందగమనానికి చికిత్స వేసేందుకు ప్రభుత్వం గట్టిగానే ప్రయత్నాలు చేయాల్సి ఉంది. ఆర్థికవృద్ధికి ఊతమిచ్చేందుకు చర్యలను ప్రకటించి అమలు చేయాలి. కేవలం జిఎస్టీ తగ్గింపులే కాకుండా దేశీయంగా వస్తూత్పత్తి ధరలు దిగివచ్చేలా చేయాలి. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచే పారిశ్రామిక రంగానికి రుణాలు ఏ మాత్రం అందు బాటులోకి రాకపోవడంతో మార్కెట్‌లో మాంద్యం ఏర్పడిందని అప్పట్లో విమర్శలు వచ్చాయి. అది జిడిపి వృద్ధిరేటు దిగజారడానికి దారి తీసిందని విశ్లేషించారు. చిన్న మధ్యతరహా పరిశ్రమలకైతే రుణ వితరణలో ప్రతికూల వృద్ధి నమోద యింది. దేశ చరిత్రలో పారిశ్రామిక రంగానికి వాణిజ్య రుణాలు భారీగా తగ్గడం కూడా ఇదే ప్రథమమని భావించారు. ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ పెట్టుబడి వ్యయాలను గణనీయంగా పెంచడం ద్వారా ఆ లోటును పూడ్చింది. అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు పెరుగు తుండటం, అమెరికా వాణిజ్య యుద్ధ భయాలు, యుద్ధాలు కూడా మన ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతోంది. కరెన్సీలు దారుణంగా పతనమవడం వంటి అంశాలు మన విదేశీ మారకపు మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీస్తున్నాయి. రూపాయి క్షీణత ఇలాగే కొనసాగితే దిగుమతులపై ఎక్కువగా ఆధారపడే మన దేశానికి ఆర్థిక ఇబ్బందులు తప్పేలా లేవు. వాణిజ్యలోటు, కరెంటు ఖాతా లోటు, ద్రవ్యోల్బణం పెరిగేందుకు రూపాయి పతనం పరోక్షంగా దోహదపడే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. రూపాయి క్షీణతతో దిగుమతులు భారమవుతాయి. చమురు, పసిడి దిగుమతుల వ్యయాలు పెరిగితే, దేశ వాణిజ్య లోటు అధికమవుతుంది. దిగుమతుల కోసం విదేశీ మారకపు నిల్వలను అధికంగా ఖర్చు చేయాల్సి రావడంతో, కరెంటు ఖాతా లోటు కూడా పెరుగు తుంది. విదేశీ ప్రయాణాలు, చదువుల ఖర్చులు భారమవుతాయి. పెట్రోలు, డీజిల్ ధరలు పెంచాల్సిన పరిస్థితి నెలకొంటుంది. దీంతో రవాణా వ్యయాలు పెరిగి సరకులు ప్రియమవుతాయి. అప్పుడు ద్రవ్యోల్బణం కూడా పెరుగుతుంది. ఆర్‌బీఐ వడ్డీ రేట్లను పెంచాల్సిన పరిస్థితి వస్తుంది. దీంతో పారిశ్రామిక ప్రగతిపై నీలినీడలు కమ్ముకుంటాయి. పరోక్షంగా ఇది దేశ అభివృద్ధిని అడ్డుకుంటుంది. దీంతోపాటు డాలర్ బలపడుతున్నందున, విదేశీ మదుపర్లు దేశీయ మార్కెట్ల నుంచి పెట్టుబడులు ఉపసంహరిస్తే, ఈక్విటీ మార్కెట్లు నష్టపోతాయి. ఈ మధ్య బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు తమ హయాంలో వృద్ధిరేటు ఎక్కువ ఉందంటే తమ హయాంలోనే అని వాదులా డుకున్నాయి. కానీ జరుగుతున్న అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం, ఫలాల పంపకం ఏ రీతిన ఉన్నదో చూడడం లేదు. అభివృద్ధి అన్నది ఉద్యోగ కల్పనకు గీటురాయిగా ఉండాలి. మొత్తానికి ఇప్పట్లో ఆర్థికరంగం కోలుకునేలా కనిపించడం లేదు.

# దేశ రక్షణ రక్షణరంగ మరింత బలోపేతం

- బ్రహ్మోస్ మిస్సైళ్లు, ఇతర ఆయుధ వ్యవస్థల తయారీ
- ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటన

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 25:** ఉత్తర్ ప్రదేశ్‌లో భారత రక్షణరంగ ఉత్పత్తుల్ని మరింత బలోపేతం చేస్తూ రైఫిల్స్ తయారీ త్వరలో ప్రారంభం కానుందని ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. గురువారం ఉత్తర్ ప్రదేశ్ లోని నోయిడాలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ వాణిజ్య ప్రదర్శన సందర్భంగా మాట్లాడిన మోదీ.. భారత సైన్యం స్వయం సమృద్ధి (ఆత్మనిర్భర్) లక్ష్యంతో విదేశీ ఉత్పత్తులపై ఆధారపడటాన్ని తగ్గించాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. 'మన సైన్యం స్వయం సమృద్ధిని సాధించాలని, విదేశీ మూలాలపై ఆధారపడటాన్ని తగ్గించాలని ఆశిస్తోంది. ఈ లక్ష్యానికి, భారతదేశంలో బలమైన రక్షణ మౌలిక సదు-



పాయాలను అభివృద్ధి చేయడానికి మేము కట్టుబడి ఉన్నాం. ప్రతి ఉత్పత్తి 'మేడ్ ఇన్ ఇండియా'గా ఉండాలని నొక్కి చెబుతున్నాం. దీనికి మద్దతుగా, ఉత్తర్ ప్రదేశ్ కీలకపాత్ర పోషిస్తోంది. రష్యా సహాయంతో ఏర్పాటు చేసిన ఫ్యాక్టరీలో రైఫిల్స్ తయారీ త్వరలో ప్రారంభం కానుంది' అని పీఎం మోదీ చెప్పారు. ఉత్తర్ ప్రదేశ్‌లో డిఫెన్స్ కారిడార్ అభివృద్ధి చేస్తున్నామని.. ఇక్కడ బ్రహ్మోస్ మిస్సైళ్లు, ఇతర ఆయుధ వ్యవస్థల తయారీ ఇప్పటికే జరుగుతోందని మోదీ చెప్పారు. ఇందులో భాగంగానే, 'అల్టిమేట్ సోర్సింగ్ బిగిన్స్ హియర్' అనే థీమ్‌తో సెప్టెంబర్ 25 నుంచి 29 వరకు ఈ ప్రదర్శన జరుగుతుందని తెలిపారు. ఇది ఆవిష్కరణ, సమైక్యత, అంతర్జాతీయాకరణపై దృష్టిపెడుతూ.. విదేశీ కొనుగోలుదారులు, దేశీయ కొనుగోలుదారులను ఆకర్షిస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని వైవిధ్యమైన, ఆధునిక పరిశ్రమలు, కొత్త ఆర్థికవ్యవస్థలను సృష్టించబోతున్నాయని మోదీ అన్నారు. ఈ అభివృద్ధి భారత రక్షణ రంగంలో స్వదేశీ తత్వాన్ని బలపరుస్తూ, ఉత్తర్ ప్రదేశ్‌ను డిఫెన్స్ హబ్‌గా మార్చనుందని ప్రధాని చెప్పారు. దేశ ఆర్థిక, రక్షణ లక్ష్యాలకు ఇది మరో మైలురాయిగా మోదీ అభివర్ణించారు.

# స్థానికంలో 69 శాతం రిజర్వేషన్లు

**బీసీలకు 42% ఎస్సీ, ఎస్టీలకు 27%**
**స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇవ్వబోతున్నాం**
**వచ్చే ఏడాదినుంచి**
**తెలంగాణలోనూ సీఎం బ్రేక్ ఫాస్ట్'**
**చెన్నైలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**





**చెన్నై :** 'తమిళనాడు అవలంబిస్తున్న సీఎం బ్రేక్ ఫాస్ట్ కార్యక్రమం హృదయాన్ని తాకుతున్నది. తెలంగాణలోనూ ఈ స్కీమ్ను వచ్చే ఏడాది నుంచి ప్రారంభిస్తామని ప్రకటిస్తున్నా' అని ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి చెప్పారు. చెన్నై జవహర్లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన 'విద్యలో ముందంజలో తమిళనాడు' కార్యక్రమంలో తెలంగాణ సీఎం పాల్గొని మాట్లాడారు. ఇంత మంచి కార్యక్రమానికి తనను ఆహ్వానించినందుకు సంతోషకరమన్నారు. అన్నాదొరై, కరుణానిధి, కామరాజ్ వంటి గొప్ప యోధుల జన్మస్థలం తమిళనాడు.. అని కొనియాడారు. కరుణా నిధి విజన్ ను అమలు చేస్తున్న సీఎం స్టాలిన్, ఉదయనిధిలను అభినందిస్తున్నట్లు చెప్పారు. ఇందిరా గాంధీ కామరాజ్ ప్లాను తీసుకువచ్చారని.. కామరాజ్ తమిళనాడులో తీసుకువచ్చిన విద్యావిధానాన్ని దేశం అనుసరిస్తున్నదని తెలిపారు. ఈ కార్యక మం ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉంటుందన్నారు. ప్రభుత్వ కళా శాలలకు వెళ్లే బాలురు, బాలికలకు నాన్ ముదలవన్ (స్కిల్ డెవలప్మెంట్) రూ.10వేల ఉపకార వేతనం స్కీమ్లు ఉండడం అదృష్టమన్నారు. తమిళనాడు పేదలకు అండగా సీఎం స్టాలిన్ ఉన్నారని.. ఎన్నో శతాబ్దాల నుంచి తమిళ, తెలుగు రాష్ట్రాలు, ప్రజల మధ్య సాంస్కృతిక, చారిత్రకపరమైన బలమైన సంబంధం ఉందని చెప్పారు. 1991 సరళీకరణ తర్వాత సరళీకృత ఆర్థిక విధానాలతో తమిళనాడులో మ్యాన్యుఫ్యాక్చరింగ్ రంగం అభివృ ద్ధి చెందిందని, తెలంగాణాలో ఐటీ, ఫార్మా రంగాలు అభివృద్ధి చెందాయని పేర్కొన్నారు. సామాజిక న్యాయం అమలులో తమిళనాడు తెలంగాణ మధ్య సారూప్యత లున్నాయని తెలిపారు.

**తెలంగాణలో 69 శాతం రిజర్వేషన్లు**

తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓబీసీలకు 42%, ఎస్సీ, ఎస్టీలకు 27% మొత్తంగా 69% రిజర్వేషన్లు ఇవ్వబోతున్నట్లు రేవంత్రెడ్డి తెలిపారు. భారతీయులంతా తమిళనాడు విద్యా విధానంతో స్ఫూర్తి పొందారని.. దేశంలో మొట్టమొదటగా మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించింది ఇక్కడేనని చెప్పారు. ఇక్కడ అమలు చేస్తున్న విద్యా విధానం తమకు ప్రేరణ కలిగించిందన్నారు. దక్షిణాదికి చెందిన కేరళ, కర్ణాటక, ఆంధ్ర, తెలం గాణకు తమిళనాడు విద్యావిధానం ఆదర్శంగా నిలిచిందని కితా బిచ్చారు. తెలంగాణలోనూ తమ ప్రభుత్వం విద్యా రంగానికి అత్యధిక ప్రాధాన్యం సాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. విద్యాశాఖను తన దగ్గరే ఉంచుకున్నానని.. యువతలో నైపుణ్యత పెంచడానికి యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ప్రారంభించామని. చెప్పారు. తెలంగాణ నుంచి ఏటా 1.10 లక్షల మంది ఇంజినీ రింగ్ విద్యార్థులు కళాశాలల నుంచి బయటకు వస్తున్నారని తెలిపారు. పీపీపీ విధానంలో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని.. దానికి చైర్మన్ గా ఆనంద్ మహీంద్రను నియమించామని వివరించారు.

# సర్కారు చేతికి మెట్రో



**మొదటి పేజీ తరువాయి**

చేశారు. దీంతో పాటు మెట్రోపై ప్రస్తుతం ఉన్న దాదాపు రూ.13వేల కోట్ల అప్పును సైతం రాష్ట్ర ప్రభుత్వం స్వీకరించాలని నిర్ణయిం చింది. దీంతో పాటు కంపెనీ ఈక్విటీ విలువకు సుమారు రూ.2,000 కోట్లు వన్-టైమ్ చెల్లింపు చేయాలని ఎల్అండ్ కంపెనీ ప్రతిపాదించింది. ఇది పూర్తయిన వెంటనే మెట్రో మొదటి దశ మొత్తం రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలోకి వస్తుందని వెల్లడించింది.

**రెండో దశ విస్తరణ కోసం..**

గ్రేటర్ హైదరాబాద్లో ట్రాఫిక్ రద్దీ, ప్రజా రవాణా అవసరాల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం మెట్రోను విస్తరించే ప్రతిపాదనలు సిద్ధం చేసింది. రెండోదశ 2ఏ 2బీ విస్తరణలో భాగంగా ఎనిమిది కొత్త లైన్ల ప్రతిపాదనలను ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి సమ ర్పించింది. దాదాపు 163 కిలోమీటర్ల మేర విస్త రించేందుకు సర్కారు ప్రయత్నాలు చేస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం పంపిన విస్తరణ ప్రతిపాదనలన్నీ కేంద్రం పెండింగ్లో పెట్టింది. ఇప్పటికే పలు మార్లు సమావేశాలు నిర్వహించిన కేంద్రం.. ప్రైవేట్ భాగస్వామ్యంతో నడుస్తున్న మొదటి దశ మెట్రోకు, ప్రభుత్వం కొత్తగా ప్రతిపాదించిన రెండో దశ విస్తరణకు సంయుక్త కార్యాచరణ అవ సరమని సూచించింది. అందుకు వీలుగా ఒప్పందం కావాలని స్పష్టం చేసింది. రెండో దశలోనూ ఎల్ అండ్ టీ భాగస్వామ్యం ఉండాల్సి ఉంటుందని సూచించింది. కేంద్రం అభ్యంతరాల నేపథ్యంలో నెలకొన్న ప్రతిష్ఠంభనను అధిగమించేందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఎల్ అండ్ టీ కంపెనీ ప్రతినిధులతో చర్చలు జరిపి నిర్ణయం తీసుకున్నారు. 2014లో దేశంలోని మెట్రో రైలు నెట్వర్క్ హైదరాబాద్ మెట్రో రెండో స్థానంలో నిలిచింది. కానీ ప్రస్తుతం అది తొమ్మిదో స్థానానికి పడిపోయింది.

**నిబంధనల ప్రకారమే : సీఎం రేవంత్**

రెండో దశ మెట్రోలో ఎల్ అండ్ టీ భాగస్వామ్యం పంచుకుంటే బాగుంటుందని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. రాష్ట ప్రభుత్వం అందుకు తగినంత ప్రాధాన్యతనిస్తుం దన్నారు. మొదటి దశ. రెండో దశ కారిడార్ల మధ్య సంయుక్త కార్యాచరణకు కచ్చితమైన ఒప్పందం అవసరమని సూచించారు. ఈ ఒప్పందం కుదిరి తేనే విస్తరించే రైలు కార్యకలాపాలు సజావుగా సాగుతాయని, ఆదాయ, వ్యయాల భాగస్వా మ్యంలో స్పష్టత ఉంటుందని వివరించారు.

**భాగస్వామిగా ఉండలేం: ఎల్ అంట్ టీ సీఎండీ**

రవాణా సంబంధిత వ్యాపారం నుంచి కంపెనీ తప్పుకున్నందువల్ల కంపెనీ ఈక్విటీ భాగస్వామిగా ఉండలేదని ఎల్ అండ్ టీ సీఎండీ స్పష్టం చేశారు. 2022 జులై 22న కుదిరిన రాయితీ ఒప్పందం ప్రకారం ప్రభుత్వం అంగీకరించిన రూ.3,000 కోట్ల వడ్డీ లేని రుణంలో రూ.2100 కోట్లు బకాయి ఉందని సీఎండీ గుర్తు చేశారు.

**సూత్రప్రాయ అంగీకారం**

చర్చల అనంతరం రాష్ట్ర ప్రభుత్వం మొదటి దశ మెట్రో ప్రాజెక్టును స్వాధీనం చేసుకోవడానికి సూత్రప్రాయంగా అంగీకరించింది. ఆర్థిక ఒప్పందాలు, చట్టపరమైన నిబంధనల ప్రకారం ఈ ప్రక్రియ చేపట్టాలని నిర్ణయించింది. ఈ నిర్ణయంతో మెట్రో రెండో దశ విస్తరణ వేగవంత మవుతుందని, కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన అనుమతులు, ఆమోదం తొందరగా వచ్చే అవకాశముందని సీఎం అభిప్రాయపడ్డారు. ఈ సమావే శంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణా రావు, సలహాదారు ఎన్వీఎస్ రెడ్డి, ఆర్థిక శాఖ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ఎంఏయూడీ సెక్రెటరీ ఇలంబర్తి, హెచ్ఎంఆర్ఎల్ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎం సెక్రెటరీ మాణిక్యరాజ్, ఎల్ అండ్ టీ సీఎండీ సలహాదారు డీకే సేన్, మెట్రో రైల్ ఎండీ, సీఈఓ కేవీబీ రెడ్డి పాల్గొన్నారు

**అతిపెద్ద పబ్లిక్ ప్రయివేట్ భాగస్వామ్యం ప్రాజెక్టు..**

మెట్రో రైల్ మొదటి దశ దాదాపు రూ.22,148 కోట్ల పెట్టుబడితో మూడు కారిడా ర్లలో 57 స్టేషన్లతో (69 కిలోమీటర్ల మేర) నిర్మించారు. వీటిలో తెలంగాణ ప్రభుత్వం రూ.2,970 కోట్లు, కేంద్ర ప్రభుత్వం రూ.1,204 కోట్లు, ప్రైవేట్ రంగ రాయితీ సంస్థ ఎల్ అండ్ టీ రూ.17,974 కోట్లు (81%) పెట్టుబడి పెట్టింది. మియాపూర్-ఎల్ బీ నగర్ మార్గంలో 27 స్టేషన్లు (29 కిలోమీటర్లు), జేబీఎస్-ఎంజీబీఎస్ మార్గంలో 8 స్టేషన్లు (11కిలోమీటర్లు), నాగోల్ రాయదుర్గ్ మార్గలో 22 స్టేషన్లు (29 కిలోమీ టర్లు) నిర్మించారు. దీనికి ప్రపంచంలోనే ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్య విధానం (పీపీపీ)తో చేపట్టిన అతి పెద్ద ప్రాజెక్ట్ గుర్తింపు లభించింది. దీనిని 2017లో ప్రారంభించారు. హైదరాబాద్ మెట్రోరైలుపై స్టాన్ ఫోర్డ్ యూనివ ర్సిటీ కేస్ స్టడీ చేయాలని నిర్ణయించింది.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
Roaming News



# వెస్టిండీస్‌తో టెస్టు సిరీస్ కోసం జట్టు ప్రకటన

## రిషభ్ పంత్, శ్రేయస్ అయ్యర్‌లకు దక్కని చోటు

అక్టోబరు నుంచి వెస్టిండీస్‌తో జరగనున్న టెస్టు సిరీస్ కోసం భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) జట్టును ప్రకటించింది. చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ నేతృత్వంలో పనిచేసిన సెలెక్షన్ కమిటీ 15 మందితో టీమ్‌ను సమకూర్చింది. కానీ, ఇందులో రిషభ్ పంత్, శ్రేయస్ అయ్యర్ లేకపోవడం టీమ్‌ఇండియా ఫ్యాన్స్‌ను నిరాశకు గురిచేసింది.

రాబోయే వెస్టిండీస్‌తో టెస్టు సిరీస్ కోసం భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) కొత్త టీమ్‌ను ప్రకటించింది. చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ 15 మంది సభ్యుల జట్టును ప్రకటించారు. విండీస్ జట్టుతో జరగనున్న ఈ సిరీస్‌కు శుభ్‌మన్ గిల్ నాయకత్వం వహిస్తాడు. గిల్ తొలిసారి స్వదేశంలో జరిగే టెస్టు సిరీస్‌కు కెప్టెన్ గా వ్యవహరిస్తున్నాడు. జూలైలో ఇంగ్లాండ్‌తో జరిగిన మాంచెస్టర్ టెస్ట్ సందర్భంగా కాలి బొటనవేలు గాయం నుంచి ఇంకా కోలుకోని కారణంగా వికెట్ కీపర్ రిషభ్ పంత్‌ను జట్టులోకి తీసుకోలేదు. టెస్టు జట్టులో పంత్ లేకపోవడం ఫ్యాన్స్‌ను ఆశ్చర్యానికి గురిచేసింది. పంత్ ఉంటే



టీమ్‌ఇండియా కష్టాల్లో ఉంటే ఆదుకునేవాడని టీమ్‌ఇండియా ఫ్యాన్స్ ఆశిస్తున్నారు. మరోవైపు ఐపీఎల్ లో అద్భుతంగా రాణించిన బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ కూడా జట్టులోకి చేర్చుకోవడంపై పలు విమర్శలు తలెత్తుతున్నాయి. జట్టులో మిడిల్ ఆర్డర్ బలమైన వీరిద్దరూ లేని టీమ్‌ఇండియాను ఊహించడం కష్టమని వారి ఫ్యాన్స్ కామెంట్ చేస్తున్నారు. 2025 ఆసియా కప్ ఫైనల్ ఆదివారం (సెప్టెంబర్ 28) దుబాయ్‌లో జరిగిన నాలుగు రోజుల తర్వాత అనగా అక్టోబర్ 2 నుండి అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో సిరీస్ ఓపెనింగ్ మ్యాచ్ జరుగుతుంది. రెండవ టెస్ట్ మ్యాచ్ అక్టోబర్ 10న ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో ప్రారంభమవుతుంది.

**వెస్టిండీస్‌తో జరగనున్న ఈ టెస్టు సిరీస్‌కు బీసీసీఐ ప్రకటించిన జట్టు..**

శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), కేఎల్ రాహుల్, యశస్వి జైశ్వాల్, సాయి సుదర్శన్, దేవ్‌దత్ పడిక్కల్, ధ్రువ్ జురెల్, రవీంద్ర జడేజా (వైస్ కెప్టెన్), వాషింగ్టన్ సుందర్, జస్‌ప్రీత్




# అభిషేక్ సిక్సర్ల రికార్డు..




సూపర్ ఫామ్ లో ఉన్న భారత విధ్వంసక ఓపెనర్ అభిషేక్ శర్మ తన ఖాతాలో మరో అరుదైన రికార్డును వేసుకున్నాడు. బుధవారం దుబాయ్ వేదికగా బంగ్లాదేశ్ తో జరిగిన మ్యాచ్ లో అద్భుతమైన అర్ధ సెంచరీ (37 బంతుల్లో 75, 6 ఫోర్లు, 5 సిక్సర్లు)తో టాప్ స్కోరర్ గా నిలిచాడు. ఈ క్రమంలో అసియాకప్ ఒక ఎడిషన్ లో అత్యధిక సిక్సర్లు బాదిన ప్లేయర్ గా కొత్త రికార్డును నెలకొల్పాడు. కేవలం 5 మ్యాచ్ ల్లోనే తను ఈ ఘనత సాధించడం విశేషం. గతంలో ఈ రికార్డు శ్రీలంకకు చెందిన ఓపెనర్ సనత్ జయసూర్య పేరిట ఉంది. 2008 ఎడిషన్ లో తను 14 సిక్సర్లు బాదడం విశేషం. అప్పుడు ఈ టోర్నీ వన్డే ఫార్మాట్ లో జరిగింది. టోర్నీ ఇప్పటివరకు 16 సిక్సర్లు బాదిన అభిషేక్.. బంగ్లాపై మ్యాచ్ లో ఐదు సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. తన జోరుతో మైదానంలోని ప్రత్యర్థి బౌలర్లు చేష్టలుడిగి చూస్తూ ఉండి పోయారు. భారీ సిక్సర్లతో తన జోరును కొనసాగిస్తూ, కేవలం 25 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేసుకున్న అభిషేక్.. సెంచరీ సాధిస్తాడని అభిమానులు ఆశించారు. గత మ్యాచ్ లో కూడా 70ం స్కోరు చేసిన అభిషేక్.. ఈసారి కూడా ఫ్యాన్స్ ను నిరాశపరుస్తూ మళ్లీ 70ం స్కోరుపైనే ఔటయ్యాడు. అయితే ఈసారి రనౌట్ రూపంలో తను ఔటవడం అభిమానులను షాక్ కు గురిచేసింది. ఇక సూపర్-4లో శ్రీలంకతో చివరి లీగ్ మ్యాచ్ తోపాటు ఫైనల్ (అర్హత సాధించడం దాదాపు ఖాయమే) మ్యాచ్ ఉండటంతో తన సిక్సర్ల సంఖ్యను మరింత పెంచుకోవాలని శర్మ అభిమానులు కోరుకుంటున్నారు. ఈనెల 26న లంకతో, ఫైనల్ మ్యాచ్ ఈనెల 28న జరుగుతుంది. ఇక ఈ మ్యాచ్ లో గెలిస్తే ఫైనల్ బెర్తు సాధిస్తుందన్న అంచనాతో బరిలోకి దిగిన భారత్.. టాస్ ఓడి ఫస్ట్ బ్యాటింగ్ చేసి, భారీ స్కోరు సాధించింది. నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 168 పరుగులు చేసింది. నిజానికి ఇన్నింగ్స్ ఆరంభంలో అభిషేక్ చేసిన విధ్వంసంతో ఇండియా భారీ స్కోరు సాధిస్తుందని భావించినా, మిడిలార్డర్ విఫలం కావడంతో అనుకున్నదానికంటే చాలా తక్కువ స్కోరుకే పరిమితం అవ్వాల్సి వచ్చింది. స్టార్ ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యా (29 బంతుల్లో 38, 4 ఫోర్లు, ఒక సిక్సర్)తో సమయోచిత బ్యాటింగ్ తో జట్టుకు మంచి స్కోరును అందించే ప్రయత్నం చేశాడు. మరో ఓపెనర్ శుభమాన్ గిల్ (29) కూడా వేగంగా ఆడే ప్రయత్నం చేశాడు. ఇక బౌలర్లలో రిషాద్ హుస్సేన్ రెండు వికెట్లతో రాణించాడు. ముస్తాఫిజుర్ రహ్మాన్ టీ20ల్లో 150 వికెట్ల మైలురాయిని చేరుకున్నాడు.

# ఆస్ట్రేలియా-ఏ జట్టుతో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్

## కెప్టెన్‌గా స్టార్ క్రికెటర్ శ్రేయస్ అయ్యర్ ఎంపిక



ఆస్ట్రేలియా-ఏ జట్టుతో జరగనున్న మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ కోసం ఇండియా-ఏ జట్టును బీసీసీఐ ప్రకటించింది. స్టార్ క్రికెటర్ శ్రేయస్ అయ్యర్‌ను ఈ సిరీస్‌కు కెప్టెన్‌గా నియమిస్తున్నట్టు బీసీసీఐ వెల్లడించింది. శ్రేయస్ అయ్యర్ ఇండియా-ఏ జట్టుకు నాయకత్వం వహించనున్నారు. అంతకుముందు, ఆస్ట్రేలియా '%ూ%'తో జరిగిన అనధికారిక టెస్ట్ సిరీస్‌లో కూడా శ్రేయస్ అయ్యర్ ఇండియా-ఏ కెప్టెన్‌గా వ్యవహరించారు. అయితే, రెండో టెస్ట్ మ్యాచ్ ప్రారంభానికి కొద్ది సమయం ముందు ఆయన ఆకస్మికంగా కెప్టెన్సీని వదులుకుని జట్టు నుంచి విడుదల కావడం చర్చనీయాంశమైంది. రెండో అనధికారిక టెస్ట్ మ్యాచ్‌కు ముందు శ్రేయస్ అయ్యర్ కెప్టెన్సీని వదులుకోవడానికి ప్రధాన కారణం వెన్ను నొప్పి. గతంలో శస్త్రచికిత్స చేయించుకున్న శ్రేయస్ అయ్యర్.. మళ్లీ వెన్నులో కొద్దిగా పట్టేసినట్టు , బిగుసుకుపోయినట్టు అనిపిస్తున్నట్లు తెలిపారు. ఈ కారణంగానే ఆయన రెడ్ బాల్ క్రికెట్ నుంచి ఆరు నెలలు విరామం తీసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ విషయాన్ని ఆయన బీసీసీఐకి కూడా తెలియజేశారు. ఆరోగ్య సమస్య ఉన్నప్పటికీ.. ఇప్పుడు వన్డే సిరీస్‌కు సారథిగా బాధ్యతలు చేపట్టడం గమనార్హం.

**మొదటి వన్డేకు ఇండియా జట్టు:**

శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), ప్రభ్‌సిమ్రాన్ సింగ్ (వికెట్ కీపర్), రియాన్ పరాగ్, ఆయుష్ బదోని, సూర్యాంశ్ షెడ్గే, విప్రజ్ నిగమ్, నిశాంత్ సింధు, గుర్జప్‌నీత్ సింగ్, యుద్ధవీర్ సింగ్, రవి బిష్ణోయ్, అభిషేక్ పోరెల్ (వికెట్ కీపర్), ప్రియాంశ్ ఆర్య, సిమర్‌జీత్ సింగ్.

**రెండు, మూడు వన్డేలకు ఇండియా జట్టు:**

శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), తిలక్ వర్మ (వైస్-కెప్టెన్), అభిషేక్ శర్మ, ప్రభ్‌సిమ్రాన్ సింగ్ (వికెట్ కీపర్), రియాన్ పరాగ్, ఆయుష్ బదోని, సూర్యాంశ్ షెడ్గే, విప్రజ్ నిగమ్, నిశాంత్ సింధు, గుర్జప్‌నీత్ సింగ్, యుద్ధవీర్ సింగ్, రవి బిష్ణోయ్, అభిషేక్ పోరెల్ (వికెట్ కీపర్), హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్.

**ఇరానీ కప్ కోసం 'రెస్ట్ ఆఫ్ ఇండియా' జట్టు:**

రజత్ పాటిదార్ (కెప్టెన్), అభిమన్యు ఈశ్వరన్, ఆర్యన్ జుయల్ (వికెట్ కీపర్), రుతురాజ్ గైక్వాడ్ (వైస్-కెప్టెన్), యశ్ ధుల్, షేక్ రషీద్, ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), తనుష్ కోటియన్,

# పాకిస్థాన్ ఆటగాళ్లపై






# ఐసీసీకి బీసీసీఐ ఫిర్యాదు


భారత్, పాకిస్థాన్ క్రికెట్ మ్యాచ్ లో అతిగా ప్రవర్తించిన ఆ ఇద్దరు పాక్ క్రికెటర్స్ పై భారత్ క్రికెట్ బోర్డు చర్యలకు ఉపక్రమించింది. ఈవిషయాన్ని ఐసీసీ దృష్టికి తీసుకెళ్లింది. ఈ-మెయిల్ రూపంలో ఐసీసీకి బీసీసీఐ ఫిర్యాదు చేసింది. పాక్ ప్లేయర్లు హారిస్ రవూఫ్, ఫర్హాన్ నుంచి లిఖితపూర్వక వివరణ కోరే అవకాశం ఉంది. వారు ఇవ్వని పక్షంలో ఐసీసీ ఎలైట్ ప్యానెల్ రిఫరీ రిచీ రిచర్డ్‌సన్ ఎదుట వాదనలు వినిపించాల్సిన అవసరం ఉంది. భారత్‌తో మ్యాచ్‌లో పాక్ బ్యాటర్ ఫర్హాన్ హాఫ్ సెంచరీ చేసిన తర్వాత గన్‌షాట్ చూపిస్తూ హావభావాలు ప్రదర్శించాడు. ఇరుదేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఇలాంటి చేష్టలకు పాల్పడటం విమర్శలకు దారితీసింది. తన సెలబ్రేషన్స్‌ను ఫర్హాన్ సమర్థించుకొనేందుకు ప్రయత్నించాడు. అప్పటికప్పుడు అలా సంబరాలు చేసుకున్నా..బయట ఎవరు ఏమనుకున్నా పట్టించుకోను అని వ్యాఖ్యానించాడు. హారిస్ రవూఫ్ ఏకంగా జెట్ ఫ్లైట్‌లు కూలినట్లు 6-0 అని సైగలు చూపించాడు. ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్‌కు చెందిన ఆరు ఫైటర్ జెట్ విమానాలను తమ సైన్యం కూల్చేసిందని పాక్ ప్రభుత్వం ప్రగల్భాలు పలికింది. దానిని గుర్తు చేసేలా హారిస్ చేష్టలు ఉన్నాయనేది ప్రధాన విమర్శ. ఇక భారత ఓపెనర్లు అభిషేక్ శర్మ, శుభ్‌మన్ గిల్‌తో వాగ్వాదానికీ దిగాడు. ఇప్పటికే రిఫరీ విషయంలో అవమానాలు ఎదుర్కొన్న పాకిస్థాన్ క్రికెట్ బోర్డు భారత్‌పై అక్కసును మాత్రం వదలట్లేదు. టీమ్‌ఇండియా సారథి సూర్యకుమార్ యాదవ్‌పై ఐసీసీకి పీసీబీ ఫిర్యాదు చేసింది. గ్రూప్ స్టేజ్‌లో పాక్‌పై భారత్ విజయం సాధించింది. ఆ గెలుపును పహల్గాం ఉగ్రదాడి బాధితులు, భారత సైన్యానికి అంకితం ఇస్తున్నట్లు సూర్య వెల్లడించాడు. ఇప్పుడు అదే పాక్ కడుపు మంటకు కారణమైంది. సూర్య వ్యాఖ్యలు రాజకీయపరంగా ఉన్నాయంటూ ఐసీసీ దృష్టికి పీసీబీ తీసుకెళ్లింది.

# ఫైనల్ ముందు టీమిండియాను వెంటాడుతున్న భయం ఏంటి?

ఆసియా కప్ 2025లో టీమిండియా అద్భుతమైన ప్రదర్శనతో ఫైనల్‌కు దూసుకెళ్లింది. ప్రస్తుత టీ20 ప్రపంచ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన సూర్యకుమార్ యాదవ్ నేతృత్వంలోని టీమిండియా గ్రూప్ దశలో అప్రతిహతంగా విజయాలను సాధించింది. సూపర్-4 రౌండ్‌లోనూ బలమైన పాకిస్తాన్, బంగ్లాదేశ్ జట్లను వరుసగా ఓడించి ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో జట్టు బలంగా కనిపిస్తున్నా.. భారత జట్టును ఓ భయం వెంటాడుతోంది. అదే.. దారుణమైన ఫీల్డింగ్ వైఫల్యం. టీమిండియా వరుసగా 2 సూపర్-4 మ్యాచ్‌లలో చేసిన ఈ పెద్ద పొరపాటే ఫైనల్లో టైటిల్‌ను దూరం చేసే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. పాకిస్తాన్ జట్టుతో జరిగిన కీలకమైన సూపర్-4 మ్యాచ్‌లో భారత ఫీల్డర్లు చూపించిన ప్రదర్శన ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదు. జట్టు ఏకంగా 5 క్యాచ్‌లు వదిలేసింది. అంతే కాకుండా ఓ సులవైన రనౌట్ అవకాశాన్ని కూడా కోల్పోయింది. అంటే 6 వికెట్లు తీసే అవకాశాలను వదులుకోవడం ప్రపంచ స్థాయి జట్టుగా పేరున్న భారత్ కు తగని విషయం. ఈ వైఫల్యం జట్టుపై తీవ్ర ఒత్తిడిని పెంచింది. పాకిస్థాన్‌పై చేసింది ఒక్క మ్యాచ్ పొరపాటు అనుకుంటే.. బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో కూడా ఫీల్డింగ్‌లో ఎలాంటి మెరుగుదల కనిపించలేదు. ఆ మ్యాచ్‌లోనూ భారత ఆటగాళ్లు 5 క్యాచ్‌లు వదిలేశారు. ఇందులో అత్యంత విచిత్రమైన అంశం ఏమిటంటే, ఈ 5 క్యాచ్‌లలో ఏకంగా నాలుగు క్యాచ్‌లు కేవలం ఒకే బ్యాట్స్‌మెన్ సైఫ్ హసన్ ఇచ్చినవే. "క్యాచెస్ విన్ మ్యాచెస్" (క్యాచ్‌లు మ్యాచ్‌లను గెలిపిస్తాయి) అనే సూత్రం క్రికెట్‌లో అందరికీ తెలిసిందే. సూపర్-4 మ్యాచ్‌లలో తక్కువ బలమైన జట్లపై ఈ పొరపాట్లు చేసినా విజయం సాధించినప్పటికీ, ఫైనల్ వంటి కీలక మ్యాచ్‌లలో ఇలాంటి చిన్న పొరపాటు కూడా జట్టుకు భారీ నష్టాన్ని, టైటిల్‌ను కోల్పోయే ప్రమాదాన్ని

# బిగ్ బాష్ లీగ్‌లోకి రవిచంద్రన్ అశ్విన్

భారత క్రికెట్ దిగ్గజం, ప్రపంచంలోని అత్యుత్తమ స్పిన్ బౌలర్లలో ఒకరైన రవిచంద్రన్ అశ్విన్.. ఆస్ట్రేలియాలోని ప్రముఖ బిగ్ బాష్ లీగ్ టీ20 టోర్నమెంట్‌లో ఆడటానికి ఒప్పందం కుదుర్చుకున్నాడు. సిడ్నీ థండర్ జట్టు తమ 15వ బీబీఎల్ సీజన్ కోసం అశ్విన్‌ను తీసుకున్నట్లు అధికారికంగా ప్రకటించింది. దీని ద్వారా బిగ్ బాష్ లీగ్‌లో ఆడుతున్న అత్యంత ప్రసిద్ధ, సీనియర్ భారతీయ ఆటగాడిగా రవిచంద్రన్ అశ్విన్ ఘనత సాధించారు. బిగ్ బాష్ లీగ్‌లో ఆడుతున్న మొదటి భారతీయ ఆటగాడు అశ్విన్ అని విస్తృతంగా ప్రచారం జరుగుతున్నప్పటికీ.. ఆ గౌరవం భారత అండర్-19 జట్టు మాజీ కెప్టెన్ ఉన్ముక్త్ చంద్ కు దక్కుతుంది. ఉన్ముక్త్ చంద్ భారత క్రికెట్ నుంచి పదవీ విరమణ చేసిన తర్వాత, 2021-22 సీజన్‌లో మెల్‌బోర్న్ రెనెగేడ్స్ తరఫున ఆడాడు. ప్రస్తుతం ఉన్ముక్త్ చంద్ అమెరికా కోసం క్రికెట్ ఆడుతున్నాడు. బీసీసీఐ నిబంధనల ప్రకారం.. ఐపీఎల్‌తో సహా భారత క్రికెట్‌లోని అన్ని ఫార్మాట్ల నుంచి పదవీ విరమణ చేసిన ఆటగాళ్లు మాత్రమే విదేశీ టీ20 లీగ్‌లలో పాల్గొనడానికి అర్హులు. ఈ విధంగా చూస్తే, భారత క్రికెట్ నుంచి రిటైర్మెంట్ తర్వాత బిగ్ బాష్ లీగ్‌లో చేరిన రెండో భారతీయ ఆటగాడు, అత్యంత ప్రముఖ ఆటగాడు రవిచంద్రన్ అశ్విన్. రవిచంద్రన్ అశ్విన్ గతేడాది డిసెంబర్‌లో అంతర్జాతీయ క్రికెట్ నుంచి, గత నెలలో ఐపీఎల్ టోర్నమెంట్ నుంచి తన రిటైర్మెంట్‌ను ప్రకటించారు. ఈ రిటైర్మెంట్ నిర్ణయమే అతనికి విదేశీ లీగ్‌లలో ఆడేందుకు మార్గం సుగమం చేసింది. 38 ఏళ్ల అశ్విన్ తన 221 మ్యాచ్‌ల




ఐపీఎల్ కెరీర్‌లో చెన్నై సూపర్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్‌తో సహా ఐదు జట్ల తరఫున ఆడి 187 వికెట్లు తీశారు. అంతర్జాతీయ స్థాయిలో 287 మ్యాచ్‌లలో 765 వికెట్లు పడగొట్టి, టెస్ట్ క్రికెట్‌లో 537 వికెట్లతో ప్రపంచంలో 7వ ప్రముఖ బౌలర్‌గా నిలిచారు. ఈ కొత్త ఒప్పందం గురించి రవిచంద్రన్ అశ్విన్ మాట్లాడుతూ.. "సిడ్నీ థండర్ జట్టు నన్ను ఎలా ఉపయోగించుకోబోతున్నారనే విషయంలో చాలా స్పష్టంగా ఉన్నారు. నన్ను ఆడించే విషయంలో వారికి ధైర్యం కూడా ఉంది. ఆ జట్టు నాయకులతో నేను జరిపిన సంభాషణలు చాలా బాగున్నాయి. డేవిడ్ వార్నర్ ఆడే విధానం నాకు చాలా ఇష్టం, మన కెప్టెన్ కూడా మనలాగే ఆలోచించడం ఎల్లప్పుడూ మంచి విషయం. థండర్ అభిమానుల కోసం నా అత్యుత్తమ ఆటను ప్రదర్శించడానికి నేను ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను" అని చెప్పారు. సిడ్నీ థండర్ జనరల్ మేనేజర్ ట్రెంట్ కోప్లాండ్ మాట్లాడుతూ, "అశ్విన్ సిడ్నీ థండర్ జట్టును ఎంచుకోవడం నాకు చాలా గర్వంగా ఉంది. అతని ఉత్సాహం, విజయం సాధించాలనే కోరిక మమ్మల్ని ఆకర్షించాయి. టోర్నమెంట్ మధ్యలో అతని ప్రపంచ స్థాయి బౌలింగ్ జట్టుకు కొత్త ఉత్తేజాన్ని ఇస్తుంది. ఒక నాయకుడిగా, మార్గదర్శకుడిగా యువ ఆటగాళ్లకు అతని అనుభవం వెలకట్టలేనిది. పశ్చిమ సిడ్నీలో వేగంగా పెరుగుతున్న భారతీయ సమాజంతో అశ్విన్ అనుబంధం మాకు కొత్త అభిమానులను సృష్టిస్తుంది" అని అన్నారు. అశ్విన్ సిడ్నీ థండర్ జట్టులో డేవిడ్ వార్నర్, లాకీ ఫెర్గూసన్, సామ్ బిల్లింగ్స్, పాకిస్తాన్ ఆటగాడు షదాబ్ ఖాన్ వంటి స్టార్ ఆటగాళ్లతో కలిసి ఆడనున్నారు.

**సిడ్నీ థండర్ స్క్వాడ్:**

వెస్ అగర్, టామ్ ఆండ్రూస్, రవిచంద్రన్ అశ్విన్ (భారత్), కామెరూన్ బాన్‌క్రాఫ్ట్, సామ్ బిల్లింగ్స్ (ఇంగ్లాండ్), ఓలి డేవిస్, లాకీ ఫెర్గూసన్ (న్యూజిలాండ్), మాథ్యూ గిల్క్స్, క్రిస్ గ్రీన్, ర్యాన్ హాడ్లీ, షదాబ్ ఖాన్ (పాకిస్తాన్),

Printed, published and owened by GOTTIPARTHI MADHURI, printed at MADHURI OFFSET PRINTERS H.NO 3-133, BC colony yadagirigutta, dist : Yadadri Buvanagiri pin : 508115, Ts Publictions at Madhuri publications. Editor : GOTTIPARTHI BHASKER. RNA TELTEL /2021/80986